జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 08

ఏప్రిల్ 16-30, 2019





స్వతంత్ర సంస్థల రక్షణ ప్రజాస్వామ్యానికి ప్రాణం













## నేతలు దాటవేసిన ఎజెండాను పట్టుకుందాం!

### రాష్ట్ర విభజన

యూనియన్ హామీలు – దేశ ఐక్యత – ఫెడరల్ వ్యవస్థ





# భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియల్ని మెరుగుపరిచేందుకు చర్యలు

భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియల్ని మెరుగుపరచటంపై సీనియర్ ఐఏఎస్ అధికారి వినోద్ కె. అగర్వాల్, లోక్‌సత్తా సీనియర్ నేత బండారు రామ్మోహన్‌రావుతో చర్చిస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్) బృందం. హైదరాబాద్‌లోని కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కూడా పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఏప్రిల్ 16-30, 2019 సంపుటి - 10 సంచిక - 08

## లోపలి పేజీల్లో...


స్వతంత్ర సంస్థల రక్షణ ప్రజాస్వామ్యానికి .......... 5

ఎన్నికల్లో నేతలు దాటవేసినా ఎజెండాను...........9

రాష్ట్ర విభజన యూనియన్ హామీలు - దేశ......... 20

పార్టీ ఫిరాయిస్తే వెంటనే వేటు పడాలి................ 24

ఎన్నికల్లో సాధించే విజయం గురించి తక్కువ..... 25

శ్వాశత మిత్రులు - శాశ్వత శత్రువులు................ 28

(మీడియాలో) 'కీ' కామెంట్లు.......................... 30

యువత స్థానిక జేపీలవ్వాలి ! .........................32





## కార్టూన్ కార్నర్

*సంపాదక వర్గం*

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA

# స్వతంత్ర సంస్థల రక్షణ ప్రజాస్వామ్యానికి ప్రాణం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



నరేంద్రమోది నాయకత్వంలో బి.జె.పి 2014లో అనుకోనిరీతిలో ఏకపార్టీ మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రజలు ఓటు వేయటమేకాకుండా మోదీ మీద అపారమయిన విశ్వాసాన్ని ప్రకటించారు. కుల, మతాల ప్రమేయం, ప్రాంతీయ వివక్ష లేకుండా అందరికి ఆర్థికాభివృద్ధి, యువతకి ఉపాధి కల్పించే విధానాలని చేపడతామని మోదీ ఇచ్చిన హామీకి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులయి మద్దతునిచ్చారు.

మోదీ కొన్ని విధానాలలో సఫలమయ్యారు. దేశమంతటికీ ఒకే పన్నుగా జి.యస్.టిని తేవటం, ఆర్థిక క్రమశిక్షణని పాటించటం ఎన్.డి.ఏ ప్రభుత్వం ప్రధాన విజయాలు. కాని ఆర్థిక ప్రగతికి, ఉద్యోగాల కల్పనకి అవసరమయిన ఇతర చర్యలు– కార్మిక చట్టాలలో మార్పు, భూసేకరణని సులభతరం చేయటం, సంపద సృష్టించేవాళ్ళని రోజూ బాధపెడుతున్న క్షేత్రస్థాయి అవినీతిని అంతం చేయటం, సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని ఆదుకుని రైతుల ఆదాయాన్ని పెంచే విధానాలని చేపట్టటం, వ్యవసాయాన్ని ఆధునీకరించి పరిశ్రమలతో సంధానించటం– ఈ రంగాలలో కావలసిన మార్పులు సాధించలేకపోవటం వల్ల ఆర్థిక ప్రగతి ఆశించినంత జరగలేదు. ఆ కారణంగా ఉపాధి కల్పన జరగలేదు. అలాగే విద్య, ఆరోగ్య రంగాలు గతంలాగే అధ్వాన్నంగా ఉండటంతో బీద కుటుంబాలు కష్టపడినా బీదరికం నుంచి బయటపడేందుకు మార్గం లేకుండా పోయింది. చట్టబద్ధపాలన చాలాకాలం నుంచి కాగితాలకే పరిమితం కావటంతో సామాన్యుల హక్కుల పరిరక్షణగాని, సకాలంలో అందరికి న్యాయం అందించటంగాని జరగటం లేదు. అధికారం ప్రజల చేరువకి అందించే ప్రయత్నాలు ఏమాత్రం జరగకపోవటంతో పాలనలో ప్రజల పాత్ర నామమాత్రంగానే కొనసాగుతోంది; కొత్తతరం ఆదర్శభావంతో నాయకత్వాన్ని చేబట్టి ప్రజలకి మంచి ఫలితాలని స్థానిక ప్రభుత్వాల ద్వారా అందించే అవకాశం లేకుండా పోయింది. రాజకీయ సంస్కరణల ఊసు కూడా లేకుండా పోవటంతో ఎన్నికలలో ఓట్ల కొనుగోలు, ధనికరాజ్యం, దోపిడీరాజ్యం ఇంకా పెరుగుతున్నాయి.

చరిత్రలో అరుదుగా వచ్చే అవకాశం నరేంద్రమోదీకి దక్కింది. గత ఐదేళ్ళలో మన దేశ ప్రజాస్వామ్యాన్ని సక్రమ మార్గాన పెట్టి ప్రజల భవిష్యత్తుకి సరయిన బాట వేసే అవకాశం వృధా అయిపోయింది. వచ్చే దశాబ్దంలోనయినా కావలసిన సంస్కరణలని, విధానాలని చేపట్టకపోతే మరింతగా ఓట్ల కొనుగోలు, తాత్కాలిక తాయిలాలు, ఓట్ల కోసం కుల, మత, ప్రాంతాల విభజనలు, అధికార కేంద్రీకరణ పెరిగే ప్రమాదముంది. చట్టబద్ధపాలన ఇంకా క్షీణించి, ఆర్థిక ప్రగతి కుంటుపడే ప్రమాదముంది.

ఇవన్నీ ఇట్లా ఉండగా గత ఐదేళ్ళలో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడ్డాయి. దూరదృష్టిలేని చర్యల వల్ల, అన్ని రంగాలని గుప్పిట్లో పెట్టుకోవాలనే ప్రయత్నం వల్ల, అధికారాన్ని ఎవరూ ప్రశ్నించరాదనే తత్వం వల్ల చాలా సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి మీద దాడి జరిగింది. ఈ పొరపాట్లు సవరించకపోతే దీర్ఘకాలంలో ప్రజాస్వామ్య మనుగడే ప్రమాదంలో పడుతుంది. కాబట్టి ఈ అనుభవం నుంచి అన్ని పార్టీలు, సమాజం పాఠాలు నేర్చుకోవటం అవసరం.

దేశ ప్రజలు అపారంగా విశ్వసించే సంస్థ సుప్రీంకోర్టు. ప్రజాస్వామ్య విలువలని కాపాడటంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకం. న్యాయస్థానాలు ప్రభుత్వాలకి, పార్టీలకి కీలుబొమ్మలయితే ప్రజలు ప్రాథమిక హక్కులని కోల్పోతారు; పాలకులు నిరంకుశులవుతారు. అలాగే సుప్రీంకోర్టు కూడా

న్యాయమూర్తుల నియామకంలో తుది అధికారం తమదే అని భావించటం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యంలో ఏ సంస్థకి తనని తాను నియమించుకొనే అధికారం ఉండదు; ప్రతి సంస్థని అయితే ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి; లేదా ప్రజలెన్నుకున్న ప్రతినిధుల పాత్ర ఆ సంస్థ నియామకాల్లోను, జవాబుదారితనంలోను ఉండాలి. కాని ఈ సమతూకాన్ని పాటించే క్రమంలో సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని, స్వతంత్ర ప్రతిపత్తిని, విశ్వసనీయతని కాపాడుకోవటం అత్యవసరం. ప్రభుత్వం వివిధ రూపాలలో న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకున్నదని గత ఐదేళ్ళుగా ఆరోపణలు వచ్చాయి. ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా మీద వత్తిడి తెచ్చి ప్రభుత్వ అభీష్టానికి అనుగుణంగా కేసులని ధర్మాసనాలకి అప్పగించటం జరిగిందని 2018 జనవరిలో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ప్రత్యక్షంగా ఆరోపణలు చేశారు. అలాగే అన్నివిధాలా సమర్థుడయిన జస్టిస్ కె.ఎమ్ జోసెఫ్ నియామకాన్ని ప్రభుత్వం కావాలని తొక్కిపెట్టి, చివరికి ప్రజాభిప్రాయం వల్ల ఆయన్ని నియమించాల్సి వచ్చింది. అయినా కావాలని ఆయన తరువాత కొలీజియం సిఫారసు చేసిన ఇందిరా బెనర్జీని, వినీత్ శరణ్‌లని ముందుగా నియమించి, వారి తరువాత జోసెఫ్‌ని నియమించటం జరిగింది. అలాగే 2018 డిసెంబరులో న్యాయస్థానమే తాము సిఫారసు చేసిన ఇద్దరు న్యాయమూర్తుల పేర్లని తరువాత ఏ కారణం చెప్పకుండా పక్కనపెట్టి ఒక నెల తరువాత దినేష్ మహేశ్వరి, సంజీవ్ ఖన్నాల పేర్లని ఖరారు చేసింది. దీని వెనకాల ప్రభుత్వ ఒత్తిడి ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ సుప్రీంకోర్టుని బలహీనపరిచాయి.


అలాగే సుప్రీంకోర్టు తరువాత ప్రజలు విశ్వసించే సంస్థ ఎన్నికల సంఘం. కాని 2017 నుంచి చాలా సందర్భాలలో ఎన్నికల సంఘం ప్రధానమంత్రి అభీష్టానికి అనుగుణంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వచ్చాయి. 2017లో హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల తేదీలని అక్టోబరు 12న ప్రకటించగా, అదేసమయంలో జరగాల్సిన గుజరాత్ ఎన్నికల తేదీలని రెండువారాల ఆలస్యంగా అక్టోబరు 25న ప్రకటించారు. ఈ ఆలస్యం కేవలం బి.జె.పికి లాభం చేకూరటానికి, ఎన్నికల కోడ్ గుజరాత్‌లో ఆలస్యంగా అమలుకావటానికి వీలుగా చేశారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అలాగే 2018లో ఢిల్లీలో 20 మంది ఆప్ శాసనసభ్యులని




అనర్హులని ప్రకటించటంలో ఎన్నికల సంఘం కనీస పద్ధతులని పాటించకుండా తొందరపాటు చూపింది. దాంతో ఢిల్లీ హైకోర్టు ఆ అనర్హతని రద్దు చేసింది. అలాగే 2018 అక్టోబరులో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చతీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికల తేదీల ప్రకటనని కేవలం ప్రధానమంత్రి సభలకి, ప్రకటనలకి ఇబ్బంది కలగకుండా ఉండాలని కొన్ని గంటలు వాయిదా వేయటం విమర్శలకి తావిచ్చింది. 2019లో తమిళనాడులో తిరువూరు ఉపఎన్నికని వివిధ సాకులని చూబెట్టి వాయిదా వేయటం కేవలం బి.జె.పి మిత్రపక్షం ఎ.డి.ఎం.కెకి ఇబ్బంది లేకుండా చెయ్యటం కోసమేనని ఆరోపణలు వచ్చాయి.

ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల తేదీల ప్రకటనలో జాప్యం కేవలం అధికార పార్టీ ప్రయోజనాలని కాపాడటం కోసమేనని ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 6వ తేది తరువాత మూడువారాలలో కేంద్ర ప్రభుత్వం 80కి పైగా పెద్ద పథకాలని ప్రకటించింది. మార్చి 4–9 తేదీల మధ్య నరేంద్రమోదీ, ఆయన మంత్రులు తొమ్మిది మెగా ప్రాజెక్టులకి శంకుస్థాపన చేశారు. అలాగే ఎన్నికల షెడ్యూలు కూడా హేతుబద్ధంగా లేకుండా బి.జె.పి రాజకీయ ప్రయోజనాలని కాపాడే రీతిలో ఖరారయిందని ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ అధికారులని ఏకపక్షంగా, కనీస ప్రాథమిక విచారణ లేకుండా బదిలీ చేయటం వెనక కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉందని ఆరోపణలున్నాయి.

ఇక రాజ్యాంగసంస్థ అయిన కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (సి.ఏ.జి) తొలిసారిగా పక్షపాతంగా, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. రాఫేల్ విమానాల కొనుగోలుపైన నివేదికని చాలాకాలం కావాలని జాప్యం చేశారని, ప్రస్తుత సి.ఏ.జి రాజీవ్ మెహ్రిషి గతంలో ఆర్థిక కార్యదర్శిగా ఉండగా తాము చేసిన నిర్ణయాలని తాము



సి.ఏ.జిగా సమీక్షించటం సరికాదని ఆరోపణలు వచ్చాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థని కుదిపేసిన నోట్ల రద్దుపైన ఇప్పటికీ సి.ఏ.జి నివేదికని సమర్పించకపోవటం ఆరోపణలకి దారితీసింది.

ఇక పార్లమెంటు ప్రజలందరికి ప్రాతినిధ్యాన్నిచ్చే సర్వోన్నత సభ; ప్రభుత్వాన్ని నిలదీసి జవాబుదారిగా చేయటం, చట్టాలని చేయటం, విధానాలని విశ్లేషించటం, బడ్జెటుని ఆమోదించటం, ప్రజల సమస్యలని, పరిష్కారాలని చర్చించటం పార్లమెంటు బాధ్యతలు. కాని 16వ లోక్‌సభ 2014-19 కాలంలో కేవలం 331 రోజులు మాత్రమే సమావేశమయింది. గత లోక్‌సభలు సగటున 468 రోజులు సమావేశమయ్యాయి. అలాగే గతంలో లోక్‌సభ ఐదేళ్ళలో సగటున 2689 గంటలు సమావేశం కాగా, 15, 16 లోక్‌సభల సమావేశాలు తగ్గిపోయాయి. 16వ లోక్‌సభ 1615 గంటలు మాత్రమే సమావేశమయింది. ఇక బిల్లుల మీద సమగ్ర అధ్యయనం విషయానికి వస్తే 14వ, 15వ లోక్‌సభలలో 60 శాతం, 71 శాతం బిల్లులని సభాసంఘాలు అధ్యయనం చేశాయి. అయితే 16వ లోక్‌సభలో కేవలం 26 శాతం బిల్లులు మాత్రమే సభాసంఘానికి సమర్పించగా, మిగిలినవాటిని ఆదరబాదరగా సమగ్రచర్చ లేకుండా ఆమోదించారు. కీలకమయిన ఆధార్ బిల్లు (2016) లాంటి వాటిని 'ద్రవ్య బిల్లు' అని తప్పుగా వర్గీకరించి రాజ్యసభ ప్రమేయం లేకుండా చట్టం చేశారు.

అలాగే సాంకేతిక కారణాలని చూపెట్టి కాంగ్రెస్ సభాపక్ష నాయకుడిని ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించలేదు. ఆ వంకతో లోక్‌పాల్ నియామకాన్ని ఐదేళ్ళపాటు జాప్యం చేశారు. ఎంతో ఆర్భాటంగా తెచ్చిన లోక్‌పాల్ చట్టం ఇప్పటిదాకా కాగితాలకే పరిమితమయి, ఇటీవలనే సుప్రీంకోర్టు ఆదేశం మేరకు లోక్‌పాల్‌ని నియమించారు. ఇంతవరకు ఉన్నతస్థానాల్లో అవినీతిని అరికట్టటానికి సంస్థాగత ఏర్పాట్లు లేవు. అలాగే ప్రతిపక్ష నాయకుడు అధికారికంగా లేని కారణంగా కేంద్ర విజిలెన్స్ కమిషన్; సి.బి.ఐ, సమాచార కమిషన్, మానవ హక్కుల సంఘం నియామకాలు ఏకపక్షంగా జరుగుతున్నాయి.

ఇక స్వతంత్రంగా నేరపరిశోధన చేయాల్సిన సి.బి.ఐ గత ఐదేళ్ళుగా మరింత వివాదాలకి, విమర్శలకి గురయింది. కేవలం రాజకీయంగా ప్రతిపక్షాలని ఇరుకున పెట్టటానికి ఒక పంజరంలో చిలకగా సిబిఐని మార్చారన్న ఆరోపణలు మరింత పెరిగాయి. సి.బి.ఐ డైరెక్టరు అలోక్‌వర్మని అడ్డుకోవటానికి, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించటానికి రాకేష్ ఆస్థానాని ప్రత్యేక డైరెక్టరుగా నియమించారు. ప్రభుత్వం పక్షపాత పోకడల వల్ల, కావాలని సి.బి.ఐని బలహీనపర్చేచర్యలని చేపట్టటం వల్ల సంస్థ అధిపతి అలోక్‌వర్మకి, ప్రత్యేక డైరెక్టరు ఆస్థానాకి మధ్య వివాదం ముదిరి సంక్షోభానికి దారితీసింది. చివరికి అలోక్‌వర్మని తొలగించటం, సుప్రీంకోర్టు ఆదేశంతో 2019 జనవరిలో మళ్ళీ ఆయనని నియమించటం, కాని కొద్ది గంటలలోనే మళ్ళీ ప్రధానమంత్రి అధ్యక్షతన సెలెక్షన్ కమిటీ అలోక్‌వర్మని మళ్ళీ తొలగించటం– ఇవన్నీ కేంద్ర దర్యాప్తు సంస్థని పూర్తి బలహీనపరచి, ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్షపాతంతో పనిచేసే సంస్థగా మార్చాయి. నేరపరిశోధన, చట్టబద్ధపాలన పట్ల ప్రజల విశ్వాసం ఇంకా బలహీనపడింది.

ఇక ఆదాయపన్ను, పరోక్ష పన్నుల శాఖలు, విశేషాధికారాలున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లని పక్షపాతంగా రాజకీయ ప్రత్యర్థులని ఇబ్బందులకు గురిచెయ్యటానికి, లేదా వ్యాపార సంస్థలని, మీడియా సంస్థలని తమకి అనుకూలంగా మార్చుకోవటానికి దుర్వినియోగం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలున్నాయి. ఉదాహరణకి ఇటీవల ప్రతిపక్షాలకి చెందిన నాయకుల మీద వివిధ రాష్ట్రాలలో దాడులు జరిగాయి. కాని అధికారపక్షానికి, వారి మిత్రపక్షాలకి చెందినవారికెవరికీ ఈ దాడుల బెడద లేదు! పన్నులు ఎగగొట్టినా, ఆర్థిక నేరాలకి పాల్పడినా, ఖచ్చితంగా విచారణ చేయవలసిందే; దాడులు

చేయవలసిందే; పెనాల్టీలు వెయ్యవలసిందే. కాని ఆ అధికారాలన్నీ కేవలం ప్రతిపక్ష నాయకుల మీద, తమ మాట వినని మీడియా మీద మాత్రమే పద్ధతి ప్రకారం ప్రయోగిస్తుంటే, అధికార పక్షంలోనివారు ఈ దాడులకు గురికాకపోతే ఈ సంస్థలని పక్షపాత రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని నిర్ధారించాలి. ఇది చట్టబద్ధ పాలనని, దేశ ఆర్థిక వ్యవస్థని బలహీనపరుస్తోంది.

ఇక రిజర్వ్బ్యాంకు విషయానికి వస్తే మున్నెన్నడూ లేనంతగా ఆ సంస్థ స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే దాడులు జరిగాయి. ప్రభుత్వ రుణాలని నియంత్రించే బాధ్యతని రిజర్వ్బ్యాంకు నుంచి తప్పించి వేరే సంస్థకి అప్పగించాలనే ప్రతిపాదన తీవ్ర విమర్శలకి దారితీసింది. అలాగే ద్రవ్యవిధాన కమిటీని కేవలం వడ్డీ రేట్లని ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా నిర్ణయించేందుకు వేశారని ఆరోపణలున్నాయి. గతంలో కూడా వడ్డీ రేట్లు తగ్గించాలని రిజర్వ్బ్యాంకు మీద వత్తిళ్లుండేవి. కాని గత ఐదేళ్ళలో ఈ వత్తిళ్ళు తీవ్రస్థాయికి చేరాయి. చివరకి తమ మాట వినటం లేదని గవర్నరు రఘురాం రాజన్ మీద కావాలని వివాదాలని సృష్టించి, అవమానపరచి, ఆయనే వెళ్ళిపోయే పరిస్థితుల్ని కల్పించారు. అలాగే కొత్త కరెన్సీ నోట్లు ముద్రించకుండా, అకస్మాత్తుగా ఏ ముందస్తు జాగ్రత్తలు లేకుండా పాత నోట్లు రద్దు చేసి ఆర్థిక వ్యవస్థని అతలాకుతలం చేశారు. రిజర్వ్బ్యాంకు నిధులని పెద్దఎత్తున ప్రభుత్వానికి బదిలీ చేయాలని వత్తిడి తెచ్చారు. చివరకి ఈ ప్రభుత్వమే నియమించిన ఉర్జిత్ పటేల్ రాజీనామా చేసే పరిస్థితులు కల్పించారు. ద్రవ్య నిర్వహణలో అనుభవంలేని, నోట్ల రద్దులో గందరగోళానికి బాధ్యుడయిన అధికారిని రిజర్వ్బ్యాంకు గవర్నరుగా నియమించారు. రిజర్వ్బ్యాంకు డైరెక్టర్లుగా నిపుణుల్ని, నిష్పాక్షికుల్ని కాకుండా అధికార పార్టీ వారిని, అనుకూలురుని నియమించారు. ఇవన్నీ రిజర్వ్బ్యాంకు స్వతంత్ర ప్రతిపత్తిని, ప్రతిష్ఠని దెబ్బతీశాయి; ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో మన దేశంపైన విశ్వాసం కొంతమేర తగ్గటంతో దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకి గండిపడింది.

దేశ ఆర్థిక వ్యవస్థని గూర్చిన నమ్మదగ్గ గణాంకాలు మన ఆర్థిక విధానాల రూపకల్పనకి, ప్రపంచ మార్కెట్లు మన మీద నమ్మకం ఉంచటానికి అత్యంత కీలకం. ఒక ప్రభుత్వం చెప్పే అంకెల మీదే నమ్మకం తగ్గితే, వాస్తవాలే తేలకపోతే విశ్లేషణకి విలువ ఉండదు; హేతుబద్ధ నిర్ణయాలు తీసుకోవటం సాధ్యం కాదు; అడ్డగోలు నిర్ణయాలతో దేశం తీవ్ర తప్పిదాలు చేసి వైఫల్యానికి దారితీస్తుంది. దేశంలో గణాంకాల సేకరణని, విశ్లేషణని పర్యవేక్షించటానికి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న గణాంకాల కమిషన్ ఉన్నది. ఇంతవరకు ఏ ప్రభుత్వమూ ఈ గణాంకాలలో జోక్యం చేసుకోలేదు. కాని ఇటీవలికాలంలో గణాంకాల కమిషన్ని పక్కనబెట్టి, నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో వార్షిక దేశ ప్రగతి రేట్లని మార్చి చూపారు. అందులో గత ప్రభుత్వ కాలంలో ప్రగతి రేటుని తగ్గించి చూపగా, ప్రస్తుత ప్రభుత్వ కాలంలో పెంచి చూపారు. సహజంగానే ఈ అంకెల సవరణలు అనుమానాలకి, తీవ్ర విమర్శలకి దారితీశాయి. అలాగే చాలా ప్రామాణికమయిన జాతీయ నమూనా సర్వే సంస్థ నిరుద్యోగం మీద గణాంకాలు సేకరిస్తే, వాటిని తొక్కిపెట్టారు. ఈ కారణాలుగా గణాంకాల కమిషన్ సభ్యులు రాజీనామాలు చేశారు.

పైన వివరించిన అంశాలు మన దేశంలో స్వతంత్ర సంస్థల పనిలో పక్షపాతం, ప్రభుత్వ జోక్యం ఎంతగా పెరిగిపోయాయో రుజువు చేస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా స్వతంత్ర సంస్థలని దెబ్బతీస్తే దేశం బలహీనపడుతుంది. పార్టీలు, ప్రభుత్వాలు ఎన్నికలలో మారుతుంటాయి. కాని దేశ ప్రయోజనాలని శాశ్వతంగా కాపాడే సంస్థల స్వయంప్రతిపత్తి అత్యంత కీలకం. అలాగే ఎన్నికయిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఈ సంస్థల ద్వారా ప్రజలకి జవాబుదారి కాకపోతే, ప్రభుత్వం ఏం చేసినా విశ్లేషించేవాళ్ళు, ప్రశ్నించే వాళ్ళు లేకపోతే ప్రజాస్వామ్యమే కాలక్రమేణా అంతరిస్తుంది. నిజమయిన ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు; మన ఓటుతో ఎన్నికయ్యే ప్రభుత్వాలు, చట్టసభలు, మన పన్నుల డబ్బుతో పోషించే అధికార యంత్రాంగం, సంస్థలు మన సేవ కోసం, మన ఉమ్మడి ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేసే ఏర్పాట్లు ఉండాలి. లేకపోతే కొందరు వ్యక్తుల స్వప్రయోజనాలు, అవినీతి, పక్షపాతం ప్రభుత్వాలని శాసిస్తాయి; రాజ్యవ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ మన కోసం కాకుండా అధికారంలో ఉన్నవాళ్ళ స్వప్రయోజనాల కోసం పనిచేస్తాయి. ప్రజాస్వామ్యమంటే ఓటు మాత్రమే కాదు; నిష్పాక్షికమయిన చట్టబద్ధ పాలన, ఎన్నికయిన ప్రభుత్వం ప్రజలకి స్వతంత్ర సంస్థల ద్వారా జవాబుదారిగా ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రాణం. ❐

# ఎన్నికల్లో నేతలు దాటవేసిన ఎజెండాను పట్టుకుందాం!

**2019** సార్వత్రిక ఎన్నికలు తెలుగు రాష్ట్రాల్లో ముగిసిపోయాయి. పోలింగ్ తొలిరోజే ఏప్రిల్ 11న ఒకేసారి ఆంధ్రప్రదేశ్‌లోని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను, తెలంగాణ లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేశారు. తెలంగాణలో అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగినందున పెద్ద ఉత్కంఠ లేదుగానీ, ఏపీలో మాత్రం చాలా టెన్షన్ కనిపిస్తోంది.. మనం ఓట్లేసేది ప్రధానంగా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను, నేతలను, పార్టీలను చూసేగాని, జాతీయస్థాయి నేతలను బట్టి కాదు గదా! ఎన్నికలు జరిగిన దాదాపు 40 రోజులు దాటాక ఫలితాలు రావటమంటే.. ఎంత ఆధునిక ఎగ్జిట్ పోల్ అంచనాలున్నా కూడా భరించడం కొంత కష్టంగానే ఉంటుంది. ఈసీ వారి 'జవాబుదారీతనంలేని' ఇష్టం మరి.

పోస్టాఫీసులు వంటి చోట నిరంతర నమోదు ఏర్పాట్లు ద్వారా ఓటర్ల జాబితా సక్రమంగా ఉండేలా చేయటం, నల్లధన ప్రవాహం, పెయిడ్‌న్యూస్, ప్రలోభ వాగ్దానాలు వంటి వాటిని నియంత్రించటం మొదలైన పనులు చేయకుండా పబ్లిసిటీ కోసం పాకులాడుతున్నట్లు వ్యవహరిస్తున్న ఈసీ సంగతి అలా ఉంచితే.. ఎన్నికలు పూర్తయి ఇంకా వేడి కొనసాగే ఈ సమయాన్ని ఒకరకంగా విలువైన అవకాశంగా కూడా తీసుకోవచ్చు.

రాజకీయ పార్టీలు తమ భావజాలాన్ని, మేనిఫెస్టోల్ని (ఉంటే గింటే) ప్రచారం చేయటానికి ఎన్నికల సమయం అనువైనదంటారు. ఎన్నికల ఫలితాలు వచ్చేదాకా ఆ టెన్షన్ అలాగే కొనసాగుతుంది కాబట్టి, ఈ గ్యాప్‌ను కూడా మనం కొన్ని ముఖ్యమైన రాజకీయ అంశాల్ని ప్రజల దృష్టికి మరింత స్పష్టంగా, బలంగా తీసుకెళ్లటానికి ఉపయోగించుకోవచ్చు. సాధారణ ఎన్నికల మేనిఫెస్టోల సమయంలోకన్నా కూడా కొన్ని విలువైన అంశాలను మనం ఈ సమయంలో ఇంకా బలంగా, ఉదాహరణలతో కూడా చెప్పుకోవచ్చు. ఎన్నికల ఫలితాలచ్చాక సైతం వీటిల్లో కొన్ని అంశాల్ని చెప్పుకోవాల్సిందే గానీ, ఇంతకు ముందే అనుకున్నట్లు.. 40 రోజుల ఎన్నికల వేడి కొనసాగుతున్నప్పుడు ఆ ప్రభావమే వేరు (40 రోజుల ధ్యాస ఉంటే అనేక పనుల్లో విజయాల్ని సాధించవచ్చంటారు, దురలవాట్లని వదిలించుకోవచ్చంటారు. అందుకే 40 రోజుల్లో తమిళం, మలయాళం, హిందీ వగైరా భాషలు నేర్చుకోవటమెలా? పుస్తకాలు, 40 రోజుల అయ్యప్ప, దుర్గామాత, హనుమాన్ దీక్ష వంటివి మన రోజువారీ జీవితాల్లో భాగమయ్యాయి)! కొత్త ప్రభుత్వాన్ని కాస్త గట్టిగా అడగటానికి ఈ స్పష్టత కొంత ఉపయోగపడుతుంది.

తాజా ఎన్నికలకు సంబంధించి ఓ 6 అంశాలను తెలుగు రాష్ట్రాల్లో గుర్తించడం జరిగింది. ఎంతో కీలకమైన ఈ అంశాల పట్ల తమ ప్రచారంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎంత గాలివాటంగా వ్యవహరించాయో ప్రజలు గుర్తించాలి. ఇవన్నీ ఎన్నికల్లో ప్రచారాంశాలే, పార్టీలు వీటన్నిటి గురించీ మాట్లాడాయి, ఏదోకరూపంలో వీటికి హామీలిచ్చాయి, ఇవన్నీ పరిష్కారం కావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారు.. కానీ వీటి వాస్తవ పరిష్కారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి, ప్రచారం మాత్రం హోరెత్తించి, చివరకు ఏ పార్టీ గెలిచినా జనం మాత్రం గెలిచే అవకాశం లేకుండా తెలంగాణ, ఏపీల్లో రాజకీయం చేశారు. అందుకే ఈ అంశాల్ని సంక్షిప్తంగా ప్రజల దృష్టికి తెచ్చి, నిజమైన పరిష్కారాలేమిటో స్థూలంగా తెలియజెప్పి, ఏ ప్రభుత్వం వచ్చినా ఎన్నికల మధ్యకాలంలో డిమాండ్లుగా చేసే ప్రయత్నమే ఇది.

**మొదటిది) ఫిరాయింపులు**

ఎవరు ఏ పార్టీలోనైనా చేరవచ్చు. కానీ ఒక పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేసి గెలిచాక మరో పార్టీలోకి మారిపోతే మాత్రం అది ప్రజాస్వామ్యం అవదు, ఫిరాయింపు అవుతుంది. ఈ ఫిరాయింపులను ఆమోదిస్తే, ఇక ఎన్నికలు అక్కర్లేదు,


ఎన్నికలకు అర్థం లేదు. కానీ విచిత్రంగా, ఫిరాయింపుల మధ్యే 2019 ఎన్నికలు తెలుగునాట హోరాహోరీగా జరిగాయి.

ఏదో భిన్నమైన భావజాలాలున్న పార్టీలు, వ్యక్తిత్వాలున్న నాయకులు ఎన్నికల్లో జనహితం కోసం పోటాపోటీగా కలబడినట్లూ, ఎవరు గెలుస్తారో తెలియని ఓ వీరోచిత యుద్ధం జరుగుతున్నట్లూ మనం ఉత్కంఠగా ఎదురుచూస్తూ ఓట్లు వేయటం, ఫలితాల కోసం ఎదురుచూడటం.. చాలా విచిత్రంగా లేదూ ఇదంతా?!

తెలంగాణలో 2018 చివర్లో ఎన్నికలు జరిగినప్పుడు కూడా లోక్‌సత్తా ఇవే అంశాల్ని స్పష్టతతో ప్రజల ముందుకు తీసుకొచ్చింది. 'లోక్‌సత్తా టైమ్స్' అక్టోబర్ 16-31, 2018 సంచికలో ఫిరాయింపుల మీదే ప్రధాన కవర్‌స్టోరీ కథనాన్ని ప్రచురించాం. 'ఈసారైనా ఫిరాయించరని, మన ఓటును గౌరవిస్తారని గ్యారంటీ ఉందా?' అని ప్రశ్నించింది. అధికార టీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీలో బొటాబొటి మెజారిటీ వస్తే, మళ్లీ పెద్ద ఎత్తున ఫిరాయింపుల్ని ప్రోత్సహించి ఓటును పరిహసిస్తుందని ఆ సంచికలో అంచనా వేశాం. అయితే పూర్తి మెజారిటీ వచ్చినా కూడా టీఆర్ఎస్ బరితెగించి ఫిరాయింపులకు పాల్పడటం ప్రారంభించింది. ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నాల్ని నిస్సిగ్గుగా చేస్తోంది. 2018లో ఏర్పడిన అసెంబ్లీలో టీఆర్ఎస్‌కు 88 సీట్లు రాగా, ఫిరాయింపులతో ఆ సంఖ్య 100ను దాటి పరిగెడుతోంది (ఇక చివరికి ఎంఐఎం, బీజేపీ వంటి మిత్రపక్షాలకు చెందిన ఓ పదిమంది మినహాయించి సభలో అందరూ టీఆర్ఎస్ వారే ఉంటారనుకోవచ్చు). రేపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే తంతు పునరావృతమవుతుంది. తెలుగుదేశం, వైకాపాల్లో ఏ పార్టీ గెలిచినా ఇదే పనిచేస్తారు. పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కొన్ని సీట్లను గెలుచుకున్నా.. వారూ ఆ పార్టీలో కొనసాగుతారని గ్యారంటీ లేదు.

అసలే మన ఎన్నికల వ్యవస్థలోని అనేక లోపాలు ప్రజాస్వామ్యాన్ని కుంగదీస్తున్నాయి. సమర్థులు, నిజాయతీ పరులు చట్టసభల్లోకి రాకుండా డబ్బు, వంశపారంపర్య రాజకీయాలు, ఓట్ల కొనుగోలు, ప్రలోభాలు, తాయిలాలు వంటివి అడ్డుపడుతున్నాయి. అయినా కూడా మన ఓటు ద్వారానే మార్పు జరుగుతోందన్న ఒక సంతృప్తి.. మార్పు పట్ల మన ఆశను బలంగా కొనసాగిస్తోంది. అలాంటిది మనం ఎవరికి ఓటు వేసినా, అది అధికార పార్టీకి పడే ఓటే.. అనే పరిస్థితి ఏర్పడితే మనం ఆశిస్తున్న మార్పు ఇంకా ఎంత సంక్లిష్టంగా, కష్టంగా మారుతుంది?

**తెలంగాణలో అసెంబ్లీ ముందస్తు ఎన్నికల సందర్భంగా**




**'లోక్‌సత్తా టైమ్స్' అక్టోబర్ 16-31, 2018 సంచికలో ఫిరాయింపుల మీద ప్రచురించిన ప్రధాన కవర్‌స్టోరీలోని కొంతభాగం ఇది. సందర్భరీత్యా మరోమారు దీన్ని తిరగేయటం అవసరమని భావించి మీ దృష్టికి తీసుకొస్తున్నాం..**

*"తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ శాసనసభ 2014 జూన్ 9న తొలిసారిగా సమావేశమైంది. ఆనాటి సభలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) సభ్యుల సంఖ్య 63. కానీ 2018లో సభ రద్దయ్యే నాటికి ఆ పార్టీకున్న బలం 90. వీరంతా ఎక్కడ్నుంచి వచ్చారు? రెండు ఉప ఎన్నికల్లో (నారాయణ్‌ఖేడ్, పాలేరు) కాంగ్రెస్ సీట్ల నుంచి ఇద్దరు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇక మిగిలినవారంతా ఇతర పార్టీల నుంచి ఫిరాయించినవారే.*

*తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికైన 15 మందిలో 12 మంది టీఆర్ఎస్‌లో చేరారు. వైకాపా నుంచి ముగ్గురు తెరాసలో చేరారు. బీఎస్పీ నుంచి గెలిచిన ఇద్దరు తెరాసలో చేరారు. చేరారు.. అనే కంటే ప్రలోభాలతోనో, బెదిరింపులతోనో చేర్చుకున్నారు అనటం సమంజసంగా ఉంటుంది. ఈ చేరికల్లో ఎక్కడా తెలంగాణ ప్రయోజనాలుగానీ, సైద్ధాంతిక అంశాలుగానీ కనిపించవు. ఈ ఫిరాయింపుల దెబ్బకి వైకాపా, బీఎస్పీ తెలంగాణ అసెంబ్లీలో తమ ప్రాతినిధ్యాన్నే కోల్పోయాయి.*

*ఎన్నికల అనంతరం తొలి సభాసమావేశంలో 9 పార్టీలకు ప్రాతినిధ్యం ఉండగా, ఇప్పుడు కేవలం 7 పార్టీలకే ఉంది. సీపీఐ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తెరాసలో చేరినా సీపీఐ ఎమ్మెల్యేగానే సభలో కొనసాగారు. కాంగ్రెస్ నుంచి*

ఎన్నికైన ఏడుగురు ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, రెడ్యా నాయక్, విఠల్‌రెడ్డి, ఎన్.భాస్కరరావు, కోరం కనకయ్య, పువ్వాడ అజయ్ కుమార్‌లు కూడా తెరాసకు మద్దతు తెలిపారు. ఇలా, తొలుత 63 మంది సభ్యులున్న టీఆర్ఎస్‌కు సభ రద్దయ్యే సమయానికి 90 మంది సభ్యులయ్యారు. పార్టీ ఫిరాయించిన కొందరికి మంత్రిపదవులు లభించగా, ఇంకొందరికి ఇంకో రూపంలో తాయిలాలు అందాయన్నది బహిరంగ రహస్యం. రేపు ఎన్నికల్లో టీఆర్ఎస్ తగిన మెజారిటీ రాకపోతే (ఆశించిన స్థానాలు రాకున్నా కూడా).. మళ్లీ కేసీఆర్ ఇదే తంతును పునరావృతం చేయటానికి ప్రయత్నిస్తారు.

ఈ విషయాన్ని కేటీఆర్ ఇప్పటికే ఒక ప్రముఖ పత్రిక ఇంటర్వ్యూలో ప్రకటించేశారు కూడా. ఫిరాయింపులతో ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచటం రాజకీయాల్లో మామూలే అని ఆయన చెప్పుకొచ్చారు. తాము బలహీన పరుస్తున్నది ప్రతిపక్షాలను కాదని, అంతకంటే ముందు ప్రజాస్వామ్యాన్నని కేసీఆర్, కేటీఆర్, వారి పార్టీ గుర్తించటం లేదు. ఒక పార్టీ గుర్తు మీద ఎన్నికల్లో ఓటు అడిగి, గెలిచి, మరో పార్టీలో చేరటం అనేది ఏ రకంగా సమర్థనీయం? ఇలా మారినవారి మీద చర్య తీసుకునే అధికారం ఉన్న స్పీకర్.. బాధ్యతని, విలువల్ని పూర్తిగా గాలికొదిలేయటంతో అధికార క్రీడలో ఫిరాయింపులు సాధారణ రాజకీయంగా తయారవుతోంది. ఫిరాయింపులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పార్టీ మారినవారిని అనర్హులుగా ప్రకటించాలని రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పినా, తాను స్వయంగా కొందరి మీద చర్యలు తీసుకుని కొద్దిపాటి ప్రయత్నం చేసి చూపినా.. (ఆయన్ను గెలిపించిన బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సహా) స్పందన లేదు. 2019 ఎన్నికల తర్వాత కూడా తెలంగాణలో ఫిరాయింపులు అడ్డూఆపూ లేకుండా కొనసాగుతుందనే సంకేతాన్నే ఈ పరిణామాలన్నీ ఇస్తున్నాయి. ఒకవేళ టీఆర్ఎస్‌ని ఓడించి, ప్రత్యర్థుల్లో బలంగా కనిపిస్తున్న కాంగ్రెస్‌ని గెలిపిస్తే?.. తగిన మెజారిటీ రాకున్నా, ఆశించిన సీట్లు రాకున్నా కాంగ్రెస్ (కూటమి) కూడా టీఆర్ఎస్ తరహాలోనే ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందనటంలో



సిద్ధాంతాలు నచ్చక వెళ్లిపోతానంటావేంటి? మన పార్టీకి సిద్ధాంతాలేమున్నాయి... వద్దు ఉండిపో!

ఎటువంటి సందేహమూ లేదు.

అసలు దేశంలో ఫిరాయింపుల జాడ్యానికి బీజం వేసిందే కాంగ్రెస్ పార్టీ (చాలా సందర్భాల్లో హర్యానా ఈ ఫిరాయింపులకు కేంద్రబిందువు– ఢిల్లీకి పక్కనుండటం వల్ల. ఆ తర్వాత దేశమంతా విస్తరించింది. 1982లో భజన్‌లాల్ హర్యానాలో జనతా ప్లాట్‌ఫాం మీద ఎన్నికయ్యారు. కానీ ఆ తర్వాత ఇందిరాగాంధీ గెలవగానే ఆయనతోపాటు మొత్తం పార్టీ మార్చేశారు. ఈదేశంలో అలా జరిగిన మొట్టమొదటి సంఘటన అది. ముఖ్యమంత్రితోపాటు అందరూ పార్టీ మార్చేశారు. వికృత రాజకీయం ఆరోజే మొదలైంది). అందునా తెలంగాణలో ఉద్యమ పార్టీగా చెప్పుకునే టీఆర్ఎస్ ఫిరాయింపుల ఉదాహరణ ప్రబలంగా కనిపిస్తోంది. ఇక కప్పదాట్లను ప్రోత్సహించకుండా కాంగ్రెస్ ఆగుతుందా?

ఈ మధ్య ఇంకో రకం ట్రెండ్ కూడా మళ్లీ ఊపందుకుంటోంది. కర్ణాటకలోలా కొద్దిపాటి సీట్లతో మూడో స్థానంలో ఉన్నా కూడా అధికారంలోకి ఎందుకు రాకూడదని ఆలోచించే ధోరణి పార్టీల్లో మొదలైంది. ఇదే ఆకాంక్షని హైదరాబాద్‌లో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ బహిరంగంగా ప్రకటించారు ('నేను ఎమ్మెల్యేనయితే నేనే ముఖ్యమంత్రిని' అని గతంలో భజన్‌లాల్ ప్రకటించారు). అలాగే టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మధ్య హోరాహోరీగా పోరు ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో, అధికార పార్టీ 'లోపాయికారీ' తోడ్పాటుతో కాసిని సీట్లను సంపాదించుకోగలిగితే.. కింగ్‌లా వ్యవహరించవచ్చని బీజేపీ వాళ్లు కూడా లెక్కలేసుకుంటున్నట్లు సమాచారం. ఇది కూడా ఫిరాయింపులను నిర్లజ్జగా ప్రోత్సహించే పరిణామమే అవుతుంది.

ఇది ఒక్క తెలంగాణకే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోనూ పెద్ద జాడ్యంగా మారింది.

రాష్ట్ర విభజన జరిగాక, తెలంగాణలో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్నారనే కారణంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మీద తొలుత కేసీఆర్ కత్తులు దూశారు. ఈ నేపథ్యంలోనే ఓటుకు కోట్లు కేసు బైటపడింది. చంద్రబాబు బూచిని చూపి ఆ తర్వాత కేసీఆర్ ఫిరాయింపుల్ని

ప్రారంభించారు. తొలుత కేసీఆర్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించిన చంద్రబాబు.. ఆ తర్వాత తానూ అదే బాట పట్టారు. ఏపీలో ప్రస్తుతానికి అధికారికంగా 23 మంది ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేల్ని అధికార తెదేపాలోకి లాక్కున్నారు. అయినా తెలంగాణలోలానే స్పీకర్‌లో స్పందన లేదు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిలో భాగమైన చంద్రబాబు.. అవసరమైతే మళ్లీ తన పొరుగు రాష్ట్రంలో ఫిరాయింపుల్ని యథేచ్ఛగా ప్రోత్సహిస్తారనటంలో సందేహం లేదు.

ఈ రకంగా ఎన్నికల్లో ఏదోకరకంగా గెలవటం, గెలిచాక ఏదోకరకంగా అధికారంలోకి రావటం, అధికారంలోకి వచ్చాక ఏదోకరకంగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను లాక్కోవటం.. అనే రాజకీయ క్రీడకు ఆమోదాన్ని పెంచే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మనం ఓటు వేయాలనుకుంటున్న పార్టీ ఎమ్మెల్యే అదే పార్టీలో కొనసాగుతారని గ్యారంటీ ఏమైనా ఉందా? అలా గ్యారంటీ లేనప్పుడు ఆ ఎన్నిక గురించి మనం ఎందుకు అంత హైరానాపడటం? పార్టీల మధ్య యుద్ధాన్ని మనం ఎందుకు పట్టించుకోవటం?..

ఒక్కసారి ఆలోచన చేయండి. పార్టీల ఫిరాయింపుల్ని మనం ఆపలేనప్పుడు, ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా చివరికి అధికార పార్టీ ఎమ్మెల్యేగానే మారుతున్నప్పుడు.. ఇక మన ఓటుకు, ప్రజాస్వామ్యానికి విలువేంటి? మన బతుకుల్ని బాగు చేసుకోవటానికి మన చేతుల్లో ఉన్న ఆయుధం ఓటే అయినప్పుడు.. ఆ ఆయుధాన్ని ఎవరి మీద ప్రయోగించినా చివరికి అధికార పార్టీ మెడలో హారంగా మారుతున్నప్పుడు, మన స్వేచ్ఛ, సార్వభౌమాధికారాలకు అర్థమేమిటి? ఇలాంటప్పుడు మన ముందున్న మార్గమేంటి?

రాజకీయానికి, మన జీవితానికి మధ్య సంబంధం లేకున్నా ఫర్వాలేదనుకుంటే, ఎన్నికల గురించి, పార్టీల గురించి పట్టించుకోవటం మానేయొచ్చు. కానీ గాంధీగారు చెప్పినట్టు, రాజకీయం మన జీవితంలోని దాదాపు ప్రతి అంశాన్నీ చుట్టుముట్టి ఉంది. రాజకీయాన్ని, పాలనను వదిలేయటమంటే, మన జీవితాలకే మనం నష్టం చేసుకున్నట్టవుతుంది. అందుకే ఫిరాయింపులకు మూలాల గురించి పట్టించుకుందాం, సరిచేయటంలో భాగమవుదాం.

ఈ వ్యాసంలో ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల గురించే ప్రస్తావించినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనే తేడా లేకుండా ఎడాపెడా పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఇవి ఒక పెద్ద జబ్బుకు సంకేతాలు మాత్రమే. అసలు జబ్బు వేరే ఉంది. ఘాటు విమర్శలు, ఫిరాయింపులకు ప్రోత్సాహాన్నిస్తున్న 52వ రాజ్యాంగ సవరణ స్థానంలో లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 91వ రాజ్యాంగ సవరణ.. ఆ జబ్బును నయం చేయటానికి సరిపోవటం లేదు. అందుకే ఇంకొన్ని బలమైన చర్యల మీద మనం దృష్టి సారించాలి.

ఫిరాయింపుల్ని అదుపు చేయడానికి నిర్ణయాధికారాన్ని స్పీకర్ చేతిలో నుంచి ఎన్నికల సంఘం చేతిలో పెట్టాలని లోక్‌సత్తా తొలుతే సూచించినా 91వ రాజ్యాంగ సవరణ సమయంలో రాజకీయ పార్టీలు అందుకు అంగీకరించలేదు. ఇప్పటికైనా ఆ పని చేయాలి. దీంతోపాటు, స్పీకర్ పదవిలో ఒకసారి నియమితమయ్యాక ఇక జీవితంలో ఏ పార్టీకీ చెందకపోవటం, స్పీకర్ పోటీ చేసే స్థానంలో ఏ పార్టీ అభ్యర్థులను పోటీకి నిలపకపోవడం వంటి ఏర్పాట్లూ కొంత పనిచేస్తాయి.

మరోవైపు.. ఎన్నికల్లో అక్రమ డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేయటం చాలా ముఖ్యం. ముఖ్యంగా రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే రాష్ట్ర అసెంబ్లీల ఎన్నికల్లో! మన ఎన్నికల వ్యవస్థ ఉన్నకొద్దీ డబ్బు చుట్టూ తిరుగుతోంది. కేవలం డబ్బుతోనే ఎన్నికల్లో గెలవలేకపోయినా, డబ్బే ఎన్నికల్లో గెలుపునకు ఎంట్రీ పాయింట్ అనే పరిస్థితి దేశం మొత్తమ్మీదా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ ముందున్నాయి. ఎన్టీ రామారావును అప్రజాస్వామికంగా పదవీచ్యుతిడ్ని చేశాక తీవ్ర అభద్రతాభావంతో ఉన్న చంద్రబాబు నాయుడు తన ముఖ్యమంత్రి పీఠాన్ని పటిష్టం చేసుకునే క్రమంలో ఎన్నికల్లో విచ్చలవిడి ధనప్రవాహానికి తెరతీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉప ఎన్నికల నుంచి మొదలైన ఆ జాడ్యం రాష్ట్రం విడిపోయినా రాజకీయం మారకపోవటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్దఎత్తున కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యేలను గుప్పెట్లో పెట్టుకోవడానికి ముఖ్యమంత్రులు శాసనసభ్యుల అరాచకాలను సహించటంతోపాటు అధికార పార్టీలోకి ఫిరాయింపుల్ని నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేసి.. ఆ పదవికి ప్రత్యక్ష ఎన్నికలను గనక నిర్వహిస్తే, ఫిరాయింపుల్ని కొంతమేర నియంత్రించచ్చు. ముఖ్యమంత్రిగా గెలవటానికి మరీ రూ. 3,000 కోట్లు ఖర్చు చేయలేరు కాబట్టి ప్రత్యక్షంగా ఎన్నుకుంటే అవినీతికి కొంత కళ్లెం పడుతుంది. దీంతోపాటు ఎమ్మెల్యేలు శాసనసభను

దాటి ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు వీలులేకుండా.. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత తదితర ఏర్పాట్లను కూడా చేస్తే, ఫిరాయింపులు ఇంకొంత తగ్గుతాయి. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే ఎన్నికల వ్యవస్థలో అదనపు ఓట్ల కోసం డబ్బు వెదజల్లటాన్ని తగ్గించేందుకు దామాషా ఎన్నికల పద్ధతిని అమలు చేస్తే ప్రజలు తమ ఓటుకు కోల్పోయిన గౌరవాన్ని తిరిగి సంపాదించుకోగలుగుతారు.

ఒక్క నిమిషం.

ఫిరాయించిన ఎమ్మెల్యేలు చేస్తున్న కొన్ని వాదనల్ని కూడా ఇక్కడ మనం కొంత పట్టించుకోవాలి. ఒకరకంగా వారంతా విషవలయంలో కూరుకుపోయి ఉన్నారు. పార్టీలకు సిద్ధాంతాలున్నాయా, పాడా? ఏ పార్టీలోకి జంప్ అయితే ఏముంది?.. అని వారు దబాయిస్తున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నదని అంగీకరించాలి. తెదేపా, తెరాస, కాంగ్రెస్, వైసీపీ మధ్య ఏమైనా తేడా ఉందా? ఏ పార్టీలో ఉంటే ఏముంది?

అందుకే విధానాల్లో పార్టీల మధ్య తేడా ఉండేలా, ప్రత్యామ్నాయాలు స్పష్టంగా కనిపించేలా మార్పులు కావాలి.

మరోవైపు, పార్టీ అధినేతలు విప్ జారీ చేసి నియంతృత్వాన్ని చెలాయించటానికి వీల్లేకుండా.. పార్టీలోని నాయకుల భిన్నాభిప్రాయాలకు అవకాశం ఉండేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించాలి. అవిశ్వాస, విశ్వాస తీర్మానాలు, బడ్జెట్ వంటి సందర్భాలను మినహాయించి మిగిలిన చోట్ల సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వినిపించే అవకాశాలుండేలా పార్టీల్ని ప్రక్షాళన చేయాలి.

ఇలా గొలుసుకట్టులా సంస్కరణలు జరిగినప్పుడు మాత్రమే.. సరైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి ముందుకొస్తారు, వారిలో భిన్నాభిప్రాయాలను పరిశీలించే అవకాశం ఓటర్లకు లభిస్తుంది, బేరీజు వేసుకుని సరైనవారిని ఎన్నుకోగలుగుతాం, మనం ఎన్నుకున్నవారు ఐదేళ్లపాటు అదే భావజాలానికి, అవే హామీలకు కట్టుబడి వ్యవహరిస్తారు, మన ఓటుకు విలువ ఉంటుంది. ఇవన్నీ ఆచరణ సాధ్యమైన సంస్కరణలని మాత్రం మనం స్పష్టంగా గుర్తుంచుకోవాలి.

మనముందున్న ఈ పరిష్కారాల్లో..

1) ఫిరాయింపులపై చర్యలు తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వడం, ఒక్కసారి స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తి ఇక ఏ పార్టీకీ చెందకుండా ఉండడం వంటి ఏర్పాట్లు చేయడం

2) రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి అమలు చేయటం

3) ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యేల మనుషులు, వారి బ్రోకరేజీ అక్కర్లేకుండా పౌర సేవల చట్టం వంటి చర్యలు చేపట్టటం

4) స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేయడం

5) పార్టీలకు సరైన విధానాలు, వాటి మధ్య ప్రత్యామ్నాయం, నేతలు తమ భిన్నాభిప్రాయలను స్వేచ్ఛగా వినిపించే అవకాశం ఉండేలా రాజకీయ పక్షాలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం

.. వేటినైనా మనం ఈసారి ఎన్నికల డిమాండ్‌గా చేస్తున్నామా? చేయకుండా ఫిరాయింపులు ఎలా పోతాయి?

నక్సలైట్లు ఏం చేస్తున్నారు? పార్టీల్ని ఫిరాయించిన, అవినీతికి పాల్పడిన రాజకీయ నేతలను కాల్చి పారేయొచ్చుగా? అని ఒకోసారి మనలో ఆవేశం వస్తుంటుంది. ఇటీవల ఏపీలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును కాల్చి చంపే ముందు మావోయిస్టులు కూడా అదేరకంగా మాట్లాడారట. 'పార్టీ ఫిరాయించి తీసుకున్న కోట్ల రూపాయలు చాలలేదా? ఇంకా గిరిజనుల బతుకులతో చెలగాటమాడుతున్నావు?' అని అడిగారట. అప్పుడప్పుడూ ఆవేశంతో అనుకుంటుంటాంగానీ.. హత్యలు, తుపాకీ పాలన పరిష్కారం కాదని మనందరికీ తెలుసు. అందుకే ఫిరాయింపుల్ని అడ్డుకునేందుకు, మన ఓటుకున్న విలువను కాపాడుకునేందుకు.. పైన చెప్పుకున్న పరిష్కారాలలో కనీసం కొన్నిటినైనా 2018-19 ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో డిమాండ్‌గా చేసుకుందాం.

పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత.. అనే రెండు డిమాండ్లనైతే రాష్ట్రాల స్థాయిలోనే వెంటనే సాధించుకోవచ్చు. మిగతావాటి మీదా మనం గట్టిగా అడగటం మొదలెట్టాలి. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలు కూడా ఉన్నాయి. నిర్దిష్ట పరిష్కారాలను కూడా చూపుతున్నాం కాబట్టి మనమేమీ సంశయించాల్సిన పన్లేదు. ఇలా తక్షణ, దీర్ఘకాలిక అనేక దృష్టితో మనం ఎన్నికల డిమాండ్లను రూపొందించుకుని క్రియాశీలంగా కదిలినప్పుడే ఫిరాయింపుల బారిన పడకుండా మన ఓటుకున్న విలువను పరిరక్షించుకోగలం."

.. ఈ కవర్‌స్టోరీలో ఫిరాయింపుల జాడ్యం గురించే కాకుండా, దాన్నుంచి బైటపడేందుకు పరిష్కారాల్ని కూడా స్థూలంగా పేర్కొనటం జరిగింది.

ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఈ నిర్దిష్ట పరిష్కారాలను అమల్లోకి తెచ్చేందుకు ఏపీ, తెలంగాణల్లోని, జాతీయస్థాయిలోని కొత్త ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను డిమాండ్ చేయాల్సిన బాధ్యత ప్రజలందరి మీదా ఉంది. ప్రస్తుతం ఫిరాయింపులకు బాధితురాలిగా మారడంతో తన మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన చట్ట సవరణ సరిపోదు. లోక్‌సత్తా సూచించిన సమగ్ర పరిష్కారాల్ని అమలు చేయాలి. లేకుంటే ముమ్ముందు ఎన్నికలకు, ఓటుకు విలువ ఇంకా దిగజారిపోయి, పౌరులుగా మన పాత్ర ఇంకా ఇంకా పరిమితమైపోతుంది.





## 2) చట్టబద్ధపాలన, పోలీస్ సంస్కరణలు

2019 ఎన్నికల్లో చట్టబద్ధపాలన, పోలీసు వ్యవస్థ పనితీరు పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై కోడి కత్తితో దాడి జరిగిన ఘటన నుంచే ఈ దిశగా పరిణామాలు వేడెక్కాయి. డేటా చోరీ, వైఎస్ వివేకానందరెడ్డి హత్య తదితర ఘటనలతో వివాదం తీవ్రతరమైంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షనేత జగన్‌తోపాటు తెలంగాణ ప్రభుత్వం



కూడా ఇందులో భాగస్వామిగా మారింది. ఆంధ్రప్రదేశ్ పోలీసుల మీద తనకు నమ్మకం లేదని జగన్ పదేపదే చెప్పుకొచ్చారు. తెలంగాణలో విచారణ జరిపినా తనకు అభ్యంతరం లేదన్నట్లు వ్యవహరించారు. స్వతంత్ర దర్యాప్తు అంటూ పట్టుబట్టారు. అలాగే డేటా చోరీ కేసులో తెలంగాణ పోలీసులెవరు తమ మీద దర్యాప్తు చేయడానికి.. అంటూ ఏపీ ప్రభుత్వం విరుచుకు పడింది. విచారణకు తెలంగాణలో 'సిట్'ను వేస్తే, ఏపీ ప్రభుత్వం కూడా 'సిట్'లను వేసింది. రాజకీయంగా వేడెక్కించి, వెర్రెక్కించి,





పార్టీలు, ప్రాంతాల పరం గా ప్రజల్ని చీల్చ డానికి ఈ ఘటనలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ, వైఎస్ జగన్ వినియోగించుకున్నారుగానీ.. నేరం చేస్తే ఎవరినైనా శిక్షించేలా చట్టబద్ధపాలనను అమలు చేయడానికి, అందుకు కావలసిన నేరపరిశోధనలో పోలీసులకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని ఒక్కరంటే ఒక్కరు కూడా చెప్పలేదు. జగన్ అధికారంలోకి వస్తే ఏపీ పోలీసులు నిజాయతీపరులైపోతారా? నేరపరిశోధనలు తెలంగాణలో ఒకరకంగా, ఏపీలో మరోరకంగా ఉంటాయా? రాజ్యాంగ ప్రజాస్వామ్య దేశంలో అందరికీ న్యాయం సమానంగా వర్తింపచేయాలన్న సూత్రానికి విలువ ఉండదా?.. దీనిపై కొన్నిరోజుల పాటు పత్రికల్లో పతాకశీర్షికలు, టీవీల్లో లైవ్‌లు, బహిరంగసభల్లో ప్రసంగాలు, సోషల్ మీడియాలో ప్రచారాలు హోరెత్తాయిగానీ.. నేరదర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా చేస్తామని, చట్టం ముందు ఎవరైనా సమానమే అనేరీతిలో చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం స్వతంత్ర ప్రాసిక్యూషన్ సహా పోలీసు, న్యాయ సంస్కరణల్ని తెస్తామని ఏ పార్టీ, ఏ నాయకుడూ చెప్పలేదు. చట్టాన్ని సక్రమంగా అమలు చేయటానికి ప్రయత్నిస్తామని జనసేన మేనిఫెస్టో మొక్కుబడిగా ఓ హామీ ఇచ్చి వదిలేసింది.

అంటే, చట్టసభకు జరిగిన ఎన్నికల్లో చట్టబద్ధపాలన చుట్టూ జరిగిన ఇంత చర్చా ఏ ఫలితం లేకుండా కేవలం నాయకులు, పార్టీలు మన నెత్తినెక్కి తొక్కటానికి మాత్రమే ఉపయోగ పడిందన్నమాట.

కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాకయినా, పోలీసు విధుల్లో రాజకీయ జోక్యం లేకుండా, చట్టబద్ధపాలనకసక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకునేందుకు పోరాడాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది.

## 3) ప్రత్యేక హోదా, ఇతర విభజన సమస్యలు

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు చర్చ చాలామేర ప్రత్యేకహోదా హామీ చుట్టూనే జరిగింది. ప్రత్యేకహోదా, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ఇతర హామీల్ని నెరవేర్చకపోవడం వల్ల ఏపీ ప్రజలు తీవ్ర అస్థిరతల




మధ్యే అభివృద్ధి బండిని నెట్టు కెళ్తున్నారన్నది వాస్తవం. విభజన సమయంలో 2014-15లో భర్తీ చేయాల్సిన రెవెన్యూ లోటునే ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయలేదు. హోదా విషయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు కూడా నకాలంలో, నరైనరీతిలో స్పందించకపోవటం వల్ల ఏపీ బాగా నష్టపోయింది. ఈ విషయాల్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లి చర్చనీయాంశం చేయటంలో ప్రతిపక్షాలు ఈ ఎన్నికల్లో విఫలమయ్యాయి. ఏపీ ప్రత్యేక హోదాకు టీఆర్ఎస్ మద్దతిస్తుందని గతంలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వికారాబాద్ ఎన్నికల ప్రచార సభలో ప్రకటించాక.. ఈ అంశం మీద కొంత కదలిక కనిపించిందిగానీ, ప్రత్యేకహోదా అంటే ఏమిటి, పారిశ్రామిక పన్ను రాయితీలు ఉంటాయా, దీనివల్ల ఏపీకి ఎన్ని నిధులు వస్తాయి వంటి అంశాల మీద ఎటువంటి చర్చా లేదు. ప్రజల్లో దీనిపై అవగాహన కలిగించి దీన్నో బలమైన, ఆచరణసాధ్యమైన ఎజెండాగా మలిచే ప్రయత్నాన్ని ప్రధాన పార్టీలు చేయలేదు. ఆవు కథలాగా హోదా నినాదాన్ని అడ్డం పెట్టుకుని లబ్ధి పొందే డ్రామానే కొనసాగించాయి.

హోదా విషయంలో కేంద్రం చేసిన మోసాన్ని, తన తప్పిదాల్ని వివరించి.. మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే హోదా నిధుల్ని, ఇతర విభజన హామీల్ని ఎలా సాధిస్తామో ఒక రోడ్‌మ్యాప్‌తో అధికార తెలుగుదేశం పార్టీ వివరించలేకపోయింది. హోదాకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మద్దతిస్తున్నారని, ఏపీలో వైకాపా, తెలంగాణలో తెరాసకు (ఒకటి మినహాయించి) అన్ని ఎంపీ సీట్లూ వస్తే కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదాను సాధించుకోవచ్చని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రచారం చేశారు. ఇంతకన్నా ఎక్కువమంది ఎంపీలు డిమాండ్ చేసినప్పుడే కేంద్రంలో నరేంద్రమోదీ ప్రత్యేకహోదా ఇవ్వలేదని, వైకాపా-తెరాస-మోదీ పార్టీ ఒకే కూటమి అని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు తిప్పికొట్టారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత సోనియాగాంధీ ప్రకటించినప్పుడు జగన్, కేసీఆర్ ఎందుకు మద్దతివ్వలేదని బాబు ప్రశ్నించారు. హోదాకు అనుకూలమని ఢిల్లీకి కేసీఆర్ లేఖ రాయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఏపీకి ప్రత్యేకహోదా హామీని ప్రకటించింది. ఒడిషా, బీహార్ రాష్ట్రాలు కూడా ప్రత్యేకహోదాని అడుగుతున్నప్పుడు.. ఏపీ పట్ల ప్రత్యేక ప్రేమను చూపిస్తారా? అని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ దీనిపై విమర్శ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ప్యాకేజీకి అంగీకరించి తమకు లేఖ రాశారని, అసెంబ్లీలో అభినందన తీర్మానాన్ని కూడా చేశారని గుర్తుచేశారు. ఏపీకి హోదా ద్వారా ఎన్ని నిధులు రావాలో తేల్చడానికి నిజనిర్ధారణ కమిటీని (జేఎఫ్‌సీ) వేసి కేంద్రం నుంచి నిధుల రూపంలోనే రూ. 74,000 కోట్ల దాకా రావాల్సి ఉందని చెప్పిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ ఎన్నికల్లో ఆ ఊసే లేకుండా కాలక్షేపం చేశారు.

ఈ రకంగా ప్రత్యేకహోదాపై అడపాదడపా అన్నట్లు సాగిన మొత్తం ప్రచారం కూడా రాష్ట్ర విభజన సమయంలోలా అస్పష్టంగా, ప్రజల్ని భావోద్వేగాల మధ్య మభ్యపెట్టేరీతిలోనే సాగింది.

ప్రత్యేకహోదా నిర్వచనంపైనే కొన్ని విభేదాలున్నాయి. వాటన్నింటినీ చర్చించి.. హోదా ప్రయోజనాలపై అన్ని పార్టీలనూ ఒకే అభిప్రాయానికి తీసుకొస్తే, ఎవరు అధికారంలోకి వచ్చినా వాటిని సాధించుకోవటం ప్రజలకు తేలికయ్యేదనే బాధ్యతాయుత వైఖరిని ఏ పార్టీ ప్రదర్శించలేదు. లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ చేయకపోయినా.. జయప్రకాష్ నారాయణ్ మాత్రమే పత్రికలు, సోషల్ మీడియా ద్వారా ఈ అంశంపై ప్రజలను చైతన్యపరిచేందుకు, ప్రజాప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రయత్నం చేశారు. ప్రత్యేక హోదా పేరును ఉపయోగించినా, లేకున్నా ఆ ప్రయోజనాలన్నీ తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు నష్టం లేని రీతిలో ఏపీ ప్రజలకు దక్కేలా విభజన హామీలపై ఆచరణాత్మకమైన పరిష్కారాల్ని ప్రజల ముందుంచారు.

"ప్రత్యేక హోదా అంటే ఏమిటి?

హోదా ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత డబ్బుని, ఎంతకాలంలోగా తేవచ్చు?

ప్యాకేజీకి-హోదా నిధులకు మధ్య తేడా ఉందా?

ప్యాకేజీని అమలు చేయటానికి ఉన్న సమస్య ఏమిటి?

పారిశ్రామిక పన్ను రాయితీల్ని ఇతర రాష్ట్రాలతో సమస్యలు లేకుండా ఏ రకంగా సాధిస్తారు?"


.. తదితర అంశాలన్నిటినీ ఇప్పటికైనా ప్రజలు వివరంగా తెలుసుకోవాలి.

ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి ఈ వివరాలన్నీ ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ – ఎఫ్.డి.ఆర్)/లోక్‌సత్తా చొరవతో జయప్రకాష్ నారాయణ్ కన్వీనర్‌గా ఏర్పాటైన స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) రూపొందించిన నివేదికలో అందుబాటులో ఉన్నాయి. ఇతర విభజన హామీలకు సంబంధించి కూడా కచ్చితంగా రావాల్సిన నిధుల వివరాలు, విధివిధానాలు ఇందులో ఉన్నాయి.

ఈ స్వతంత్ర నిపుణుల బృందం నివేదికను ఉపయోగించుకుని కొత్త ప్రభుత్వాన్ని, రాజకీయ పార్టీల్ని ప్రజలు ఫెడరల్ స్ఫూర్తితో హోదా, విభజన హామీల అమలుకై డిమాండ్ చేయాలి. అవసరమైతే కేంద్ర–రాష్ట్రాల మధ్య హక్కులకు సంబంధించిన వివాదంగా సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయండని అడగాలి. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై మళ్లీ మోసపోకుండా చూసుకోవాలి. ఫెడరలిజాన్ని విస్తరించుకోవటానికి కూడా ఇదో అవకాశం.

### 4) విద్య, ఆరోగ్యం, ఉపాధి, రిజర్వేషన్లు

పాఠశాల విద్యలో భారతదేశమే అధ్వాన్నంగా ఉంటే.. అందులో కూడా తెలుగు రాష్ట్రాలు ఇంకా అధ్వాన్నంగా ఉన్నాయని పలు సర్వేలు వెల్లడించాయి. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 'సురాజ్య' యాత్ర




ద్వారా ఏపీలోని పలు స్కూళ్లలో అభ్యసన ప్రమాణాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో వెల్లడించారు. ప్రతి జిల్లాలోని ప్రధాన ఆస్పత్రిని, పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి.. వైద్యసేవలు ఎంత భారంగా మారాయో, ప్రజలు, వైద్యులు కూడా నష్టపోయే రీతిలో ఆరోగ్య విధానం ఎంత అధ్వాన్నంగా ఉందో పరిష్కారాలతో వివరించారు. కానీ ఈ ఎన్నికల్లో.. మార్పు కోసం వచ్చామని చెప్పుకున్న జనసేన సహా ఏ పార్టీ ఈ మౌలికాంశాలపై పరిష్కారాల జోలికి పోలేదు. ఎన్నికల్లో ప్రజలు ఉపాధి, ఆరోగ్యాలను బాగా కోరుకుంటున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సర్వేలో తేలినా కూడా.. అంత డిమాండ్ ఉన్న అంశాల్ని పార్టీలు పక్కదోవ పట్టించాయి. పిల్లల్ని బడికి పంపిస్తే నెలకింతని ఇస్తానని వైఎస్ జగన్, ఆ తర్వాత ఆయన్ని కాపీ కొట్టి చంద్రబాబు చెప్పారుగానీ.. ఈవేళ సమస్య ఎన్‌రోల్‌మెంట్ కాదని, విద్యాప్రమాణాలని వారు పట్టించుకోలేదు.


రూ.5 లక్షల వార్షికాదాయం ఉన్నవారందరికీ ఆరోగ్య ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే భరిస్తుందన్న వైసీపీ హామీ వినటానికి ఆకర్షణీయంగా ఉందిగానీ, ఇది ప్రజలకు తక్కువగా.. ప్రైవేటు వైద్యసంస్థలకు ఎక్కువగా మేలు చేస్తుంది. ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉన్నా రాష్ట్రంలో ఎందుకు ఆరోగ్య సంక్షోభం పెరుగుతోందన్న పరిశీలనను జగన్ పార్టీ చేయలేదు. చంద్రబాబుదీ డిటో బాట. విద్య, ఆరోగ్యాలను అందిస్తామని నినాదాలనైతే ఇచ్చారుగానీ.. నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని ప్రతి బిడ్డకూ, ప్రతి కుటుంబానికీ అందుబాటులోకి తెచ్చేందుకు స్పష్టమైన విధానాన్ని ఏ పార్టీ ఈ ఎన్నికల్లో ప్రకటించలేదు. కనీసం కాగితాల మీద కూడా!

తెలుగు రాష్ట్రాల్లో కూడా పోటీ చేసిన ప్రధాన జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ గురించి కూడా ఇక్కడ కొంత చెప్పుకోవాలి. ముఖ్యంగా కొంత మెరుగ్గా ఉన్న కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి.

నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమానికి ప్రజల నుంచి కూడా సానుకూల స్పందన వచ్చిందని పలు రాష్ట్రాల నుంచి సమాచారం ఉంది. అయినా కూడా జబ్బు ముదిరాక పైస్థాయిలోనే ఖర్చు చేసి నిధుల్ని వృథా చేయకుండా, ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసి ప్రజలకు నిజమైన ఆరోగ్యాన్ని అందిద్దామన్న చిత్తశుద్ధి ప్రధానమంత్రి పార్టీ బీజేపీలోనే కరువైంది. విద్య గురించి పిసరంత కూడా ఆ పార్టీ చేయలేదు. విద్యాహక్కు చట్టంలోని లోపాల్ని సరిచేసి సరైన విద్యావిధానాన్ని రూపొందించటానికి మోదీకి ఐదేళ్లలో సమయమే చిక్కలేదు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ మౌలికాంశాల విషయంలో మోదీ బీజేపీకి లోతైన పరిశీలన, అవగాహన కరువైంది.

కాంగ్రెస్ పార్టీ 2019 ఎలక్షన్ మేనిఫెస్టోలో 12వ తరగతి

వరకూ నిర్బంధ ఉచిత విద్యను అందిస్తామని, విద్యకు జీడీపీలో 6శాతం కేటాయిస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు కూడా పాఠశాల స్థాయిలో ఉచిత విద్య చాలామందికి అందుబాటులో ఉంది. అయితే ఆ చదువు ఉపాధి అవకాశాలకు, వికాసంతో సమాజాభి వృద్ధిలో భాగస్వాము లవటానికి పనికొచ్చేది కాదు. ఈవేళ మన విద్యారంగానికున్న సమస్య బడ్జెట్‌లో కేటాయింపుల్ని పెంచటంకన్నా కూడా బోధనా ప్రమాణాల్ని బాగు చేయటం! విద్యలో ప్రమాణాలు పెంచటానికి తగిన పద్ధతుల్ని మేనిఫెస్టో పేర్కొనకుండా.. విఫలమైన విద్యాహక్కు చట్టం చుట్టూ, నిధుల పెంపు చుట్టూ మూస పద్ధతిలో ఆకర్షించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ చేసింది. పాఠశాల విద్యను రాష్ట్రాలకు బదిలీ చేయటం, మేయర్ల ప్రత్యక్ష ఎన్నిక సహా నగరాల పాలనలో మరింత స్వయంప్రతిపత్తి ఫెడరలిజం బలోపేతానికి ఉపయోగ పడతాయిగానీ, అసలు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం విద్యాహక్కు చట్టం వంటి అనాలోచిత చట్టాల్ని తేకుండా స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చి ఉంటే.. పాఠశాల విద్యకు సంబంధించి కేంద్రం కర్రపెత్తనం ఉండేది కాదు గదా! అలాగే ఆరోగ్య సేవల్ని హక్కుగా తీసుకొస్తామన్నారు. వైద్యరంగ బడ్జెట్‌ను క్రమంగా జాతీయాదాయంలో 3 శాతానికి పెంచుతామన్నారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేయటం, ప్రయివేటు భాగస్వామ్యం, ఇన్సూరెన్స్ నమూనా నుండి సార్వత్రిక వైద్య ఆరోగ్య పద్ధతికి మళ్లటం వంటి అంశాలు బాగానే ఉన్నా.. వాటి అమలు సర్కారుకు భారంగా, ప్రైవేటుకు లాభంగా మారకుండా వ్యాధుల నివారణ, ప్రాథమిక వైద్యానికి, తృతీయ స్థాయి వైద్యానికి సరైన చట్రాన్ని ప్రతిపాదించలేకపోయారు. కేవలం సిబ్బంది భర్తీ వంటి సాధారణ ప్రకటనలకే పరిమితమయ్యారు. అలాగే ఉపాధికి ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, ఉపాధి హామీ పథకాన్ని 3.0గా విస్తరించటం, రిజర్వేషన్లను పరిష్కారంగా చూపించే ప్రయత్నం చేశారు తప్ప.. కార్మిక చట్టాల సవరణ, భూసేకరణను సులభం చేయటం, ప్రభుత్వ సేవల్లో అవినీతిని తొలగించటం, ప్రభుత్వోద్యోగ నియామకాల నిబంధనల మార్పు వంటి చర్యలతో ఇబ్బడిముబ్బడిగా ఉపాధి అవకాశాలను పెంచే సమగ్ర ప్రయత్నం కాంగ్రెస్ మేనిఫెస్టోలో కనిపించలేదు. ఉపాధి లేని వృద్ధిని దీర్ఘకాలం కొనసాగించి దేశానికి హానిచేసిన దుష్కీర్తి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వానిది! అయితే నరేంద్రమోదీ ప్రభుత్వం అంతకంటే అధ్వాన్నంగా వ్యవహరించి యూపీయే చెడ్డపేరుకు కొంత అడ్డచక్రం వేసింది. తన పాత వైఫల్యాన్ని సరిదిద్దుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తాజా మేనిఫెస్టో ద్వారా ప్రయత్నమైతే చేసిందిగానీ.. 'నాణ్యమైన విద్య – ఉపాధి అవకాశాలు – కార్మిక, ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో సంస్కరణల'కు మధ్య ఉన్న విడదీయలేని సంబంధం సమూలంగా ప్రతిఫలించేలా నూతన విధానాల్ని మేనిఫెస్టోలో చూపలేకపోయింది. పైగా కనీస ఆదాయ పథకం పేరుతో దేశ జనాభాలోని 20 శాతానికి ఏడాదికి రూ.72,000 ఇస్తూ, సేవలతో సంబంధం లేకుండా ప్రభుత్వోద్యోగుల సంఖ్యను పెద్దఎత్తున పెంచుతూ, వారికి భారీగా పెంచిన వేతన సవరణలు అమలు చేస్తూ విద్య, వైద్యం వంటి మౌలిక రంగాల్ని ప్రక్షాళన చేయగలమని నమ్మించే ప్రయత్నం చేశారు.








ప్రజల్లో ఎంతో డిమాండ్ ఉన్న ఈ మౌలికాంశాలకు ఆచరణాత్మకంగా చక్కటి పరిష్కారాలు అందుబాటులో ఉన్నా కూడా, దాటవేసేందుకు అన్ని ప్రధాన పార్టీలూ ప్రయత్నించటం తాజా ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపించింది. కోట్లాది యువత ఎంతో ఆశగా ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తుండగా.. రిజర్వేషన్లు, నిరుద్యోగ భృతి, నెలవారీ ఆదాయం వంటి ఉపశమనాలతో దాటవేసేందుకు అధికార, ప్రతిపక్షాలు ప్రయత్నించాయి.


నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రిజర్వేషన్లను దాటి ఉపాధి అవకాశాలు.. అంశాలపై హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన పరిష్కార విధానాలను ప్రజలు ఎన్నికల మధ్య కాలంలో పాలకుల్ని సతాయించైనా సాధించుకోవాలి.

**5) అవినీతి**

తాజా ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో బాగా చర్చనీయాంశమై ఎటువంటి పరిష్కారం లేకుండా పోయిన మరో అంశం అవినీతి. వైఎస్ జగన్‌పై భారతదేశంలోని అన్ని సెక్షన్ల ప్రకారం కేసులు నమోదై ఉన్నాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారని, కేసుల




నుంచి బైటపడటానికి లాలూచీ పడతారని అన్నారు. ఒకప్పుడు సీబీఐ జేడీ హోదాలో జగన్‌పై కేసులు పెట్టిన జనసేన నేత వీవీ లక్ష్మీ నారాయణ వాస్తవాల్ని బైటపెట్టాలని డిమాండ్ చేశారు. తనను ముఖ్యమంత్రిని చేస్తే కాంగ్రెస్ పార్టీకి రూ.1500 కోట్లు ఇస్తానని జగన్ తనతో చెప్పారని, ఆయనకు అంత డబ్బు ఎక్కడ్నుంచి వచ్చిందోనని తాను ఆశ్చర్యపోయానని జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ ఫరూక్ అబ్దుల్లా రాయలసీమ ప్రచారసభలో అన్నారు. మరోవైపు చంద్రబాబు అవినీతి నారాసురుడని జగన్ ఆరోపించారు. లక్షల కోట్ల అవినీతికి బాబు పాల్పడ్డారన్నారు. తెలంగాణలోనూ ఫిరాయింపులకు ప్రలోభాల అవినీతిపై చర్చ జరిగింది. రాష్ట్రంలో






అవినీతిపై రోజూ వేల ఆరోపణలస్తున్నాయని కేసీఆర్ చెప్పారు. ఇంత చర్చయితే జరిగిందిగానీ.. అవినీతి అంతానికి నిర్దిష్ట చర్యల్ని ఒక్క నేతా, ఒక్క పార్టీ కూడా ప్రకటించలేదు. గతంలో ఓటుకు కోట్లు కేసులో నీ పోలీస్, నా పోలీస్, నీ ఏసీబీ, నా ఏసీబీ అని వ్యవహరించ నట్లే.. ఇప్పుడు కూడా అవినీతి విషయం లో కేవలం ఆరోపణల ద్వారా లబ్ధి పొందు దామని మాత్రమే పార్టీలు ప్రయత్నించాయి. ప్రధాని మోదీ కూడా నోట్ల రద్దు విషయంలోలాగానే ఎన్నికల సమయంలో అవినీతి ఆరోపణల ద్వారా ప్రత్యర్థులను బెదిరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించటం తప్ప.. అవినీతి నిర్మూలన దిశగా ఆలోచన చేయలేదు. అవినీతిపై చట్టాల్ని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ వారు మేనిఫెస్టోలో మొక్కుబడిగా ఓ మాట అని వదిలేశారంతే. దర్యాప్తు సంస్థలైన ఏసీబీలకు స్వయంప్రతిపత్తి కల్పించటం, లోకాయుక్తను బలోపేతం చేసి దాని పరిధిలోకి ఏసీబీని తేవటం, నేరపరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా చేయటం, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తోపాటు త్వరితగతిన కేసుల విచారణకు న్యాయ వ్యవస్థలో మార్పులు తేవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా 'పౌర సేవల' చట్టం



అమల్లోకి తేవటం వంటి చర్యల్ని తెస్తేనే అవినీతిని కట్టడి చేయగలం. ఇవి లేకుండా అవినీతి ఆరోపణల మధ్య కొట్టుకుపోతుంటే, ఎన్నికల తర్వాత ఎన్నికలొస్తూ తరాలు మారిపోతుంటాయిగానీ, మన బతుకులు బాగుపడవు (లంచాలు లేకుండా పౌరసేవల్ని మెరుగుపరచేందుకు ప్రత్యేక రెవెన్యూ, మున్సిపల్ చట్టాల్ని తెస్తామని కేసీఆర్ అంటున్నారు. వీటిపై ఎన్ని అనుమానాలు ఉన్నా సానుకూలంగానే వేచిచూద్దాం). అందుకే అవినీతి అంతానికి 1,2,3 అంటూ.. ఈ విధానపరమైన చర్యల కోసం తెలుగు ప్రజలు పట్టుబట్టాలి.

### 6) వ్యవసాయం

వ్యవసాయ సంక్షోభం ఈ ఎన్నికలకు ముందు నుంచే చర్చలోకి రాగలిగింది. రైతుల ఆగ్రహానికి గురికావటంతో కేంద్రం నుంచి రాష్ట్రస్థాయి వరకూ అన్ని పార్టీలూ వ్యవసాయదారులకు హామీల్ని గుప్పించాయి. అయితే ఇవన్నీ కూడా పరిష్కారాలు కావు. కేవలం తాత్కాలిక తాయిలాలు. తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు 2014 ఎన్నికలకు ముందే రుణమాఫీని హామీ ఇచ్చాయి. దీనివల్ల ఏం ప్రయోజనం లేదని తెలిసినా మళ్లీ అదే తరహాలో స్కీముల్ని ప్రకటించాయి. సాధారణ రైతుకు ప్రధానమంత్రి ఏడాదికి రూ.6,000 నగదు సాయాన్ని ప్రకటించగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పేరుతో కేంద్ర సాయంతో కలుపుకుని లేదా వేరేగా రూ.15,000 సాయాన్ని అందరు రైతులకు ప్రకటించింది. కౌలు రైతులకు కూడా సాయానికి హామీ ఇచ్చింది. వైఎస్ జగన్ కూడా ఎకరాకు రూ.12,500 పెట్టుబడి సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 'రైతుబంధు' పేరుతో రైతుల లెక్కన కాకుండా ఎకరాల లెక్కన సాయాన్ని ప్రక టించింది. ఈ స్కీముల సాయం పై పెద్దఎత్తున ప్రచారం జరిగిందిగానీ.. ఈ స్కీములు అమలవుతున్నా రైతులు ఎందుకు గిట్టుబాటు ధర కోసం ఆందోళనలు చేస్తున్నారు? అన్న చర్చ జరగలేదు. ఉదాహరణకు, ప్రభుత్వాలు అనుసరించిన ఎగుమతి-దిగుమతి, ఇతరత్రా మార్కెటింగ్ విధానాల్లోని లోపాలవల్ల తెలుగు రాష్ట్రాల్లో మినుములు బస్తాకు రూ.10,000కు పైన రైతులు నష్టపోయారు. ఒక్కో రైతుకి ఎన్ని వేల రూపాయల తాయిలాలనిస్తే ఈ ఒక్క పంటలో జరిగిన నష్టాన్ని భర్తీ చేయగలరు? ప్రభుత్వం ఎగుమతులను దెబ్బతీస్తూ




దిగుమతులను పెంచుతూ అనుసరించిన వ్యవసాయ విధానం వల్ల 2014 నుంచి 2018 మధ్యకాలంలోనే రైతులకు రూ. 4,00,000 కోట్ల పైగా ధరలపరంగా నష్టం వచ్చినట్లు అంచనా. నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో రైతులు బ్యాలెట్ పోరుకు దిగితే కూడా వ్యవసాయ సంక్షోభంపై మౌలికమైన చర్చకు పార్టీలు ముందుకు రాలేదు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఈ అంశంపై కొంత మాట్లాడిందిగానీ, ప్రత్యేక కిసాన్ బడ్జెట్, రుణమాఫీ వంటి యాంత్రిక పరిష్కారాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. రైతుకు తాత్కాలిక సాయం చుట్టూ కన్నా.. శాశ్వతంగా లాభసాటి ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాల రూపకల్పనకు చర్చ జరగాలి. లేకుంటే మళ్లీ మళ్లీ తాత్కాలిక తాయిలాలతో రైతులను మోసం చేసేందుకే పార్టీలు ప్రయత్నిస్తుంటాయి. ఏపీలో తెదేపా, వైకాపాలు ధరల స్థిరీకరణ నిధి, గిడ్డంగులు, వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు గురించి మేనిఫెస్టోలో హామీ ఇవ్వటాన్ని స్వాగతించాలి. కానీ భారీస్థాయిలో ఉన్న వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి మౌలిక వసతుల్లో పెద్దఎత్తున ప్రైవేటు నిధులు కూడా అవసరం. వీటికి మళ్లీ భూచట్టాల సవరణ అవసరం. వీటి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కొద్దిపాటి సానుకూల మార్పులు, పెద్దఎత్తున తాత్కాలిక తాయిలాలు అనే కోణంలో రైతులను ఆకట్టుకోవాలనే ప్రయత్నం జరిగిందే గానీ, వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా పటిష్ట పునాది వేద్దామన్న ఆలోచన ఏపీలో టీడీపీ, వైసీపీ రెంటిలో కనిపించటేదు. రైతుకు ఆదాయాన్ని పెంచుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు, వినియోగదారుడు చెల్లించే ధరలో అత్యధిక శాతం రైతుకే దక్కేలా చేసేందుకు ఆచరణసాధ్యమైన పరిష్కారాల్ని లోక్‌సత్తా ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. జేపీ సోషల్ మీడియా ఖాతాల్లో కూడా తాజా వివరాలతో ఇవి అందుబాటులో ఉన్నాయి.

ఇంకా ఎన్నికల సంఘం నిర్వాకంతో ఓట్ల గల్లంతు, అవకతవకలు, అర్హుల ఓట్లు లక్షల సంఖ్యలో తొలగింపునకు ఫామ్–7ను రాజకీయ పార్టీలు దుర్వినియోగం చేయటం, కులాలవారీ చీలికలు, విపరీత నల్లడబ్బు ప్రవాహం, ఓటర్ల కొనుగోలు, ప్రలోభాలు కొత్త రూపు దాల్చటం, వ్యవస్థలను బలహీనపరచటం, ఓటర్లుగా తప్ప పోటీలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం, అధ్వాన్న స్థానిక పాలన, పన్నులకు తగ్గ సేవలు అందకపోవటం, వాతావరణ కాలుష్యం వంటి పలు అంశాలున్నాయి. కానీ పైన పేర్కొన్న 6 మౌలిక, తక్షణ ప్రధానాంశాలకు ప్రస్తుతానికి పరిమితమవుదాం. అన్ని ప్రధాన పార్టీలూ ఈ అంశాల గురించి మాట్లాడాయి తప్ప స్పష్టమైన విధానాల్ని, గ్యారంటీల్ని ఇవ్వలేదు. కొన్ని చిన్న పార్టీలైతే ఇంకా బలంగా విద్య, ఆరోగ్యం గురించి మాట్లాడాయి. కానీ వారు కూడా విధానపరమైన స్పష్టతకు ప్రాధాన్యతనివ్వలేదు. దీనివల్ల ప్రజలకు ఏదో మేలు చేస్తున్నట్లు కనిపిస్తుంది తప్ప.. సంక్షోభం మాత్రం పరిష్కారమవదు. విద్య, ఆరోగ్య రంగాలలో మార్పులంటూ నినాదాలిచ్చి ఫీజు రీఇంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటివి అమలు చేయటం వల్ల ప్రయివేటు వ్యక్తులకు సొమ్ములు, రాజకీయ నాయకులకు ఓట్లు తప్ప ప్రజలకు పెద్ద ప్రయోజనం లేకుండా ఎన్ని వేల కోట్ల ప్రజాధనం వృధా అయిందో తెలుగు రాష్ట్రాల్లో మన కళ్ల ముందే కనిపిస్తోంది. వాటంతటవి వచ్చే మార్పులకు ప్రతిస్పందిస్తాం తప్ప, మేం చొరవ తీసుకుని ప్రజలకు మేలు జరిగేలా స్పందించము.. అని నాయకులు అంటే, తరాలపాటు నష్టం అలా కొనసాగుతూనే ఉంటుంది.

అందుకే స్పష్టమైన, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలతో ఈ ఆరు అంశాలపై పట్టుబిగించి డిమాండ్ చేద్దాం. 2019 ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీ ప్రకటించిన 'ప్రజల ఎజెండా'లో, 'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర ఎజెండాలో కూడా ఈ అంశాలు కనిపిస్తాయి. అవసరమైతే అన్ని పార్టీలనూ ఒకే ఉమ్మడి ఎజెండా కోసం డిమాండ్ చేసైనా సరే వీటిని సాధించుకోవాల్సిన అవసరమైతే మన ముందు తక్షణం ఉంది. ఒక పార్టీ ప్రభుత్వం చేసిన కార్యక్రమాన్ని మరో పార్టీ ప్రభుత్వం రద్దు చేయటం, పేరు మార్చటం వంటివి కాదు మనకి కావలసింది.. ప్రజలకు అవసరమైన, ప్రభుత్వాలు చేయాల్సిన మౌలిక కార్యక్రమాలను ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా సమర్థవంతంగా, పూర్తిస్థాయిలో అమలు చేయటం. ఇవన్నీ చేశాక డబ్బులుంటే రోజుకో కొత్తరకం తాత్కాలిక తాయిలాలు ఇచ్చుకోమనండి. మనకు ఎదిగే అవకాశాల్ని, తలెత్తుకుని జీవించే సమాజాన్ని ఇవ్వకుండా నిరుద్యోగ భృతి, తాత్కాలిక తాయిలాలు, మద్యం, స్మార్ట్‌ఫోన్‌లతో కూడిన లేని నిషా జీవితాన్ని ఇస్తామంటే మాత్రం ఎంతమాత్రం ఊరుకోకూడదు. ❐

# రాష్ట్ర విభజన
# యూనియన్ హామీలు - దేశ ఐక్యత - ఫెడరల్ వ్యవస్థ





**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

**2014**లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అంతకుమునుపు ఏర్పడిన కొత్త రాష్ట్రాల తీరుకి భిన్నంగా అసాధారణ పద్ధతిలో జరిగింది. నిజమయిన ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాల ఉనికిని యూనియన్ ప్రభుత్వం ఏకపక్షంగా మార్చలేదు. అయితే మన రాజ్యాంగంలో ఒక రాష్ట్రం విభజనకి అంగీకరించితేనే రాష్ట్ర విభజన జరగాలన్న నిబంధన లేదన్న సాంకేతిక కారణాన్ని చూపి, రాష్ట్ర శాసనసభ విభజనని తిరస్కరించినా, రాష్ట్రంలో కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయినా, అన్ని ప్రాంతాల మధ్య ఒప్పందం లేకుండానే పార్లమెంటు ఏకపక్షంగా ఆంధ్రప్రదేశ్‌ని విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సాంప్రదాయమే కొనసాగితే జాతీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి ప్రాంతంలో, రాష్ట్రంలో ఏదో ఒకరకంగా తంపులు తీసుకువచ్చి, రాష్ట్రాల విభజనకి పాల్పడేవారు. అయితే ఆంధ్రప్రదేశ్ విభజన వల్ల ప్రధాన జాతీయ పార్టీలు కాంగ్రెస్, బి.జె.పిలకి ఏ రాజకీయ లబ్ధి చేకూరలేదు; నిజానికి గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోయింది. దీంతో భవిష్యత్తులో రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాల విభజనని ఎత్తుగడగా ప్రయోగించే అవకాశం లేకుండా పోయింద్మి దేశ ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం తప్పింది.

అయితే ఆంధ్రప్రదేశ్ విభజన పర్యవసానాలు పరిశేష ఆంధ్రప్రదేశ్ (కోస్తా, రాయలసీమ)ని ఇంకా బాధిస్తూనే ఉన్నాయి. హైదరాబాదు నగరాన్ని ఇప్పటి ఆంధ్రప్రదేశ్ కోల్పోవటం వల్ల రెండు తీవ్ర నష్టాలు వాటిల్లాయి. మహానగరాలలోనే సంపదసృష్టి ఎక్కువగా జరగటంతో ప్రభుత్వాలకి పన్నుల ఆదాయం అత్యధికంగా నగరాల నుంచే వస్తుంది. హైదరాబాదు నగరంలో 2012-13 సంవత్సరంలోనే ప్రభుత్వానికి రూ.12,000 కోట్లకి పైగా మిగులు ఉండగా, దాన్ని ఆనాటి రాష్ట్రంలో మిగిలిన 22 జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం వినియోగించేది. ఈవేళ ఆ మిగులు బహుశా ఏడాదికి రూ.25-30,000 కోట్ల దాకా ఉండొచ్చు. ఈ మిగులంతా తెలంగాణ రాష్ట్రానికి చెందుతుంది కాబట్టి, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌కి పన్నుల ఆదాయంలో గండి పడింది. కాని జీతభత్యాలు, పాలనా ఖర్చులు, నడుస్తున్న పథకాలు తగ్గించటం సాధ్యం కాదు కాబట్టి రాష్ట్రానికి ఆర్థికలోటు బాగా పెరిగింది. రెండో సమస్య, గతంలో పాలకులకి దూరదృష్టి లేకపోవటంతో అన్ని విద్య, ఆరోగ్య అవకాశాలు, శిక్షణా సంస్థలు, శాస్త్రపరిశోధనా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు ప్రధానంగా హైదరాబాదు నగరంలోనే ఏర్పడ్డాయి. దాంతో విద్య, ఆరోగ్య, పరిపాలన, శాస్త్ర పరిశోధనా సంస్థల లోపం ఒక పక్కన, కొత్తగా ఉపాధి కల్పించే పరిశ్రమల లోటు మరోపక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలయ్యాయి. రాజధాని, మహానగరం ఉన్న ప్రాంతం విడిపోవాలని కోరుకొని సాధించుకోవటం ఇదే తొలిసారి.

ఈ ప్రత్యేక పరిస్థితులలో యూనియన్ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టం ద్వారాను, ప్రధానమంత్రి పార్లమెంటులో 2014 ఫిబ్రవరి 20న చేసిన నిర్దిష్టమయిన ప్రకటన ద్వారాను ఆంధ్రప్రదేశ్‌కి జరిగిన నష్టాన్ని కొంతమేరకు పూడ్చటానికి చట్టబద్ధ ఏర్పాట్లు చేశారు. కాని గత ఐదు సంవత్సరాలలో ఈ హామీలు కొన్ని పాక్షికంగా అమలు కాగా, చాలా హామీలు అమలుకు నోచుకోలేదు. చట్టంలోను, సుదీర్ఘ చర్చ, మంత్రి మండలి నిర్ణయాల తరువాత

ప్రధాని చేసిన ప్రకటనలోను ఉన్న హామీలు కూడా అమలుకాకపోతే చట్టాల మీద, ప్రభుత్వాల మీద, పార్లమెంటు మీద ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది; యూనియన్ – రాష్ట్రాల సంబంధాలలో అపనమ్మకం చోటు చేసుకుంటే ఫెడరల్ వ్యవస్థ దెబ్బతినటమే కాకుండా, దేశ ఐక్యతకి దీర్ఘకాలంలో సవాళ్ళు ఎదురవుతాయి. అయితే ప్రతి అంశాన్ని దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోణం నుంచి కాకుండా, పక్షపాత రాజకీయ కళ్ళద్దాల నుంచి చూడటం వల్లను, మన బహిరంగ చర్చలో ప్రజల ప్రయోజనాలు కాకుండా పార్టీల అధికార క్రీడ మాత్రమే చోటు చేసుకోవటం వల్లను, అసలు ఏ మేరకు యూనియన్ ఇచ్చిన నిర్దిష్ట హామీలు అమలయ్యాయనే వాస్తవాలను తెలుసుకోవటవే కష్టమయింది. అభిప్రాయాలు ఎన్నైనా ఉండవచ్చు; కాని వాస్తవం ఎప్పుడూ ఒకటే ఉంటుంది. వాస్తవాలతో సంబంధంలేని అభిప్రాయాలు చవకైనవి, నిరర్థకమైనవి, జనహితాన్ని దెబ్బతీసేవి. కాబట్టి ప్రజాస్వామ్య పీఠం చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం నిశితంగా పరిశీలించి వాస్తవాలని నిగ్గు తేల్చింది. ఆ నివేదికని నలుగురు జాతీయ నిపుణులు– తెలుగు రాష్ట్రాలకి చెందనివారు– అధ్యయనం చేసి, మెరుగులు దిద్ది ధృవీకరించారు. ఆ నిపుణుల నివేదిక ప్రకారం యూనియన్ చాలా హామీల విషయంలో రాష్ట్రానికి బాకీ పడింది. 2019 లోక్‌సభ ఎన్నిక తరువాత ప్రభుత్వాన్ని ఏ కూటమి ఏర్పాటు చేసినా, రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ కలసికట్టుగా కృషి చేసి హక్కుల్ని సాధించుకోవటం, ఇప్పటి నుంచే సమాజం, పత్రికలు, పార్టీలు అందుకు తగ్గ వ్యూహాన్ని రచించటం అవసరం. అధికారం కోసం జరిగే పోరాటంలో ప్రజల ప్రయోజనాలు మరుగునపడితే చరిత్ర క్షమించదు.




క్లుప్తంగా ఏ అంశాల మీద రాష్ట్రానికి యూనియన్ నుండి సహాయం ఇంకా అందాల్సి ఉందో చూస్తే, ఆ సహాయం అందకపోవటం వల్ల అభివృద్ధిరీత్యా గాని, మౌలిక సదుపాయాల కల్పనలో గాని, పెట్టుబడులలో గాని రాష్ట్రం ఎంత నష్టపోతోందో అర్థమవుతుంది.

మొదటిది, రాష్ట్ర వనరుల లోటుని పూడ్చటం. 2015–20 కాలంలో రెవెన్యూలోటుని అంచనా వేసి పూడ్చటానికి 14వ ఆర్థికసంఘానికి నివేదించారు. 14వ ఆర్థిక సంఘం 2015–20 కాలంలో లోటుని రూ. 22,112 కోట్లుగా అంచనా వేసి, లోటున్న ఇతర రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కి కూడా ఆ లోటును భర్తీ చేయటానికి వార్షిక గ్రాంటులని మంజూరు చేసింది. కాని రాష్ట్రం ఏర్పడ్డ తొలి సంవత్సరం 2014–15లోని లోటు ఆర్థిక సంఘం పరిశీలనలో లేదు కాబట్టి, ఆ లోటుని యూనియన్ భర్తీ చెయ్యాలి. 2014–15 సంవత్సరానికి రాజ్యాంగసంస్థ సి.ఏ.జి ఆడిటు లెక్కల ప్రకారం రెవెన్యూలోటుని రూ. 16,078.76 కోట్లుగా తేల్చారు. ఇదికాక ఆ సంవత్సరంలో ఖర్చుపెట్టే బాధ్యత ఉన్నా (ప్రధానంగా ఉద్యోగులకి సవరించిన వేతనాలు, ఖజానాలో డబ్బులేక చెల్లించని బిల్లులు కలిపి) రూ. 6,870 కోట్ల మేరకు వ్యయాన్ని తరువాతి సంవత్సరానికి వాయిదా వేశారు. 2015–16లో ఆ డబ్బుని ఖర్చు పెట్టారు; అయితే ఆ ఖర్చు క్రిందటి సంవత్సరానిది కాబట్టి లోటు పెరుగుతుంద్కి కాని ఆర్థికసంఘం ఆ లోటుని భర్తీ చేయదు. కాబట్టి వాయిదా వేసిన ఖర్చు 2014–15 వనరుల లోటులో భాగం. ఇలా మొత్తం కలిపి 2014–15లో రూ. 22,948.76 కోట్ల వనరుల లోటు తేలింది. ఈ లోటులో నుంచి నిపుణుల కమిటీ రుణమాఫీలపైన ఆ సంవత్సరం పెట్టిన రూ. 7,069.67 కోట్లని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా పెంచిన సాంఘిక సంక్షేమ పెన్షన్ల మొత్తం రూ. 1590.74 కోట్లని తొలగించింది. అవి పోగా, యూనియన్ భర్తీ చేయాల్సిన మిగిలిన వనరుల లోటు రూ. 14,288.35 కోట్లు. అయితే ఐదేళ్ళ తరువాత ఈనాటి వరకు రాష్ట్రానికి అందింది, లేదా హామీ ఇచ్చింది కేవలం రూ. 4117.89 కోట్లు మాత్రమే. అంటే కనీసం రూ. 10,308.85 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. కేవలం 8 శాతం వడ్డీ వేసుకున్నా ఈ మొత్తం ఈనాటికి దాదాపు రూ. 13,800 కోట్లు దాటుతుంది. ఆర్థికంగా లోటుని భరిస్తున్న రాష్ట్రానికి ఈ వనరులు అందకపోవటంతో సహజంగానే అభివృద్ధికి ఆటంకం అవుతుంది.




రెండోది, విభజన చట్టంలో దొర్లిన పొరపాటు వల్ల, పరిశ్రమల మీద పన్నుల బాకీలు హైదరాబాదులోనే వాటి కేంద్ర కార్యాలయాలుండటంతో తెలంగాణకి చెందుతాయి; కాని ప్రభుత్వం పరిశ్రమలకి ఏమైనా తిరిగి చెల్లించాల్సి వస్తే, ఆ బరువు పరిశ్రమ ఉన్న రాష్ట్రం మీద పడుతుంది. ఉదాహరణకి కృష్ణపట్నం పోర్టు తీరప్రాంతంలో ఉన్నప్పటికీ, ఆ కంపెనీ చెల్లించాల్సిన రూ. 92.98 కోట్ల బకాయిలు తెలంగాణకి చేరింది. కాని ఆ కంపెనీకి ప్రభుత్వం ఏమన్నా గత వసూళ్ళని తిరిగి చెల్లించాలంటే ఆ భారం ఆంధ్రప్రదేశ్ మీద పడుతుంది. అలాకాక పన్నుల వసూళ్ళు, తిరిగి చెల్లింపుల భారం– రెంటినీ జనాభా దామాషా పద్ధతిలో పంచుకుంటే, ఆంధ్రప్రదేశ్‌కి అదనంగా రూ. 3820.36 కోట్లు రావాలి; ప్రస్తుతం ఈ మొత్తాన్ని రాష్ట్రం కోల్పోయింది. పొరపాటు పార్లమెంటు చేసిన చట్టం వల్ల జరిగింది; కాబట్టి ఈ నష్టాన్ని పూడ్చే బాధ్యత యూనియన్ ప్రభుత్వమే తీసుకోవాలి.

మూడోది, ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు అందుతున్న రీతిలో కేంద్ర ప్రతిపాదిత పథకాలలో 90 శాతం నిధులు యూనియన్ నుండి వస్తే, ఐదేళ్ళ కాలంలో రాష్ట్రానికి రూ. 16,447 కోట్లు గ్రాంటుగా రావాలి. ఇందుకు యూనియన్ అంగీకరించింది; అయితే ఒక మడత పేచీ పెట్టింది. ఈ డబ్బుని విదేశీ రుణాలతో అమలుచేసే ప్రాజెక్టుల ద్వారా మాత్రమే ఇస్తామని షరతు పెట్టింది. కాని ఈ ప్రాజెక్టుల ద్వారా దేశమంతా వచ్చే డబ్బు ఏడాదికి సగటున రూ. 10,000 కోట్లు మాత్రమే. వీటి ద్వారా రాష్ట్రానికి 2018 డిశంబరు దాకా అందింది కేవలం రూ. 16 కోట్లు లోపే. అంటే నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్లుంది. ఈ 16,447 కోట్ల డబ్బుని ఇతర అప్పుల చెల్లింపు రూపంలో రాష్ట్రానికి అందించే ఏర్పాటు చెయ్యటం సమంజసం; అదే నిపుణుల కమిటీ తీర్మానించింది.

నాలుగోది, పోలవరం ప్రాజెక్టు. యూనియన్ ఇస్తున్న సాయంతో పోలవరం ప్రాజెక్టు వేగంగా అమలవుతోంది. యూనియన్ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టుని రాష్ట్రమే నిర్మిస్తోంది. దేశంలో ఇంత వేగంగా, రికార్డు స్థాయిలో అమలవుతున్న ఏకైక జాతీయ ప్రాజెక్టు ఇదే. అయితే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక పోలవరం మీద చేసిన వ్యయం మార్చి 31, 2019 నాటికి రూ. 11,210.74 కోట్లు కాగా, యూనియన్ ఇప్పటివరకు రూ. 6,727.26 కోట్లు విడుదల చేసింది. అంటే రాష్ట్రం ఖర్చు చేసి, రావాల్సిన బకాయిలు రూ. 4483.48 కోట్లు ఉన్నాయి. వెంటనే బకాయిలు చెల్లించి, ప్రాజెక్టుని వేగంగా గడువు లోపలే పూర్తి చేసే ఏర్పాట్లు చేయటం అవసరం. అయితే ఇక్కడ వనరుల విడుదలలో జాప్యం తప్ప, మరే వివాదం ప్రస్తుతానికి లేదు.

ఐదోది, వెనకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర ఏడు జిల్లాలకి బుందేల్ఖండ్ తరహాలో ప్రత్యేకసాయాన్నిస్తామని యూనియన్ హామీనిచ్చింది. అయితే 1.83 కోట్ల జనాభా ఉన్న బుందేల్ఖండ్ ప్రాంతానికి 2009–2017 మధ్య మొత్తం రూ. 11,866 కోట్ల సాయం అందింది. ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడ్డ ప్రాంతాల (ప్రకాశం జిల్లా మార్కాపూర్ డివిజన్‌తో కలిపి) జనాభా 2.52 కోట్లుంది. ఈ జనాభాని, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలకి కనీసం రూ. 25,302 కోట్లు సాయం అందాలి. కాని ఇప్పటివరకు కేవలం రూ. 1,050 కోట్లు మాత్రమే రాష్ట్రానికి అందింది.

ఆరోది, దుగ్గిరాజుపట్నంలో రూ.7,988 కోట్ల ఖర్చుతో మేజర్‌పోర్టు నిర్మాణం గతంలోనే మంజూరయింది; దాన్ని విభజన చట్టంలో చేర్చారు. కాని ఆ స్థలం అనువుగా లేదన్న కారణంతో యూనియన్ ప్రభుత్వం ఇప్పటిదాకా పోర్టు నిర్మాణాన్ని చేపట్టలేదు. సాంకేతికతంగా అనువయిన స్థలంలో మేజర్‌పోర్టుని నిర్మించటం, లేదా దానికి ప్రత్యామ్నాయంగా అంత ఖర్చుకి తగ్గకుండా అదనపు మౌలిక సదుపాయాలు రాష్ట్రం కోరిన రీతిలో నిర్మించటం అత్యవసరం.

ఏడోది, పదకొండు జాతీయ ప్రాధాన్యతగల విద్య, ఆరోగ్య సంస్థలని యూనియన్ ఏర్పాటు చేయాలని చట్టంలో ఉంది. వీటి కోసం యూనియన్ చెయ్యాల్సిన మొత్తం వ్యయం రూ.12,746.38 కోట్లు. రాష్ట్రం తన వాటాని భూమి, మౌలిక సదుపాయాల రూపంలో ఇప్పటికే ఖర్చు చేసింది. అయితే యూనియన్ ఇప్పటికి రూ.845.42 కోట్లు- అంటే 6.63 శాతం మాత్రమే విడుదల చేసింది. మిగిలిన 93 శాతాన్ని వేగంగా విడుదల చేసి అన్ని సంస్థలని పూర్తిస్థాయిలో వచ్చే ఐదేళ్ళలో ఏర్పాటు చెయ్యటం అవసరం.

ఎనిమిదోది, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అదనపు సాయాన్నిస్తామని, కొత్త రాష్ట్ర రాజధానికి రోడ్లు, రైలు, ఇతర రవాణా సౌకర్యాలని కల్పిస్తామని హామీని చట్టంలో చేర్చారు. ఇప్పటివరకు 13వ షెడ్యూల్‌లో ఉన్న అంశాలలో ఐదింటిని అసలు అమలు చేయలేదు; మూడు పథకాలు ఇంకా ప్రాథమిక దశలో ఉన్నాయి. ముఖ్యంగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, రాజధానికి రోడ్డు, రైలు సౌకర్యాలు రాష్ట్రాభివృద్ధికి కీలకం. వాటిని వేగంగా అమలు చేయటం, ఉదారంగా సాయం చేయటం అవసరం.

తొమ్మిదోది, రాజధాని నిర్మాణం కోసం సాయం. అమరావతిని ఒక ప్రధాన నగరంగా తీర్చిదిద్దటానికి రూ.1,09,023 కోట్లతో బృహత్తర పథకాన్ని రూపొందించి రాష్ట్రం అమలు చేస్తోంది. ఇప్పటిదాకా కేవలం రూ.1500 కోట్లు రాజధానికి, మరో రూ.1000 కోట్లు గుంటూరు, విజయవాడ నగరాల డ్రైనేజీ వ్యవస్థకి యూనియన్ విడుదల చేసింది. రాష్ట్రం ప్రతిపాదించిన మొత్తం పథకాన్ని యూనియన్ మంజూరు చెయ్యటం సాధ్యం కాదు. కాని ప్రభుత్వ కార్యాలయాలు వగైరాలతోపాటు, ఒక మంచి నగర నిర్మాణానికి కావలసిన మౌలిక సదుపాయాలు.. రోడ్లు, వరద నివారణ, మురికినీటి పారుదల, మంచినీటి సదుపాయం, ప్రజారవాణా, నగరానికి కావలసిన రోడ్డు, రైలు సౌకర్యాలు- ఈమేరకు అంచనా వేసి రాష్ట్రానికి సాయం చేయటం అవసరం. ఈ అవసరమయిన మౌలిక సదుపాయాలకి సాయం అందించాలని చట్టంలోని 93వ సెక్షన్ నిర్దేశించింది.

ఇక ప్రత్యేక ప్రతిపత్తి హోదా ఉన్న రాష్ట్రాలకు ఇస్తున్న రీతిలో పెట్టుబడులపైన పన్ను రాయితీల అంశం! ఇప్పుడిచ్చిన పన్ను రాయితీలు కేవలం నామమాత్రం, కంటితుడుపు చర్యలే. యూనియన్ ఆంధ్రప్రదేశ్‌తోను, ఇతర రాష్ట్రాలతోను చర్చించి ఆమోదయోగ్యమయిన మేరకు రాయితీలు ఇవ్వాలి. పన్ను రాయితీలతోపాటు రాష్ట్రంలో పారిశ్రామికీకరణ కోసం మొత్తం పెట్టుబడులని యూనియన్ భరిస్తూ మెగా ప్రాజెక్టులు, క్లస్టర్ అభివృద్ధి పథకాలు చేపట్టాలి. సంకల్పం ఉంటే రాష్ట్రానికి చిత్త శుద్ధితో సాయం చేయటం సాధ్యం.

ఈ మొత్తం అందాల్సిన సాయం వెంటనే నగదు రూపంలోనే ఇవ్వాలంటే యూనియన్‌కి కూడా సాధ్యం కాకపోవచ్చు. వనరుల కొరత ఉంటే ఇతర రూపాలలో సాయాన్నందించవచ్చు. రాష్ట్రం యూనియన్‌కి ఇవ్వాల్సిన బాకీలు చాలా ఉంటాయి. వాటిని చెల్లవేస్తే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుంది; అదే సమయంలో యూనియన్‌కి అదనపు భారం పడదు. అలాగే రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక బాండులని విడుదల చేసి సేకరించిన డబ్బుని రాష్ట్రానికి గ్రాంటు రూపంలో ఇవ్వవచ్చు; తిరిగి చెల్లించే బాధ్యతని యూనియన్ తీసుకుంటుంది. ఇలా వివిధ రూపాలలో యూనియన్‌కి వెంటనే నగదు రూపంలో ఖర్చు కాకుండా రాష్ట్రానికి ప్రయోజనం కలిగించటం అవసరం.

ఆంధ్రప్రదేశ్ విభజన ఫెడరల్ సూత్రాలకి విరుద్ధంగా, ఏకపక్షంగా, బలవంతంగా జరిగిన ప్రక్రియ. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని గమనించి చట్టపరంగా నిర్దిష్ట హామీలని ఇవ్వటం జరిగింది. వాటిని వేగంగా, సంతృప్తికరంగా, నిజాయతీగా అమలు చెయ్యకపోతే యూనియన్ విశ్వసనీయత, చట్టబద్ధపాలన, ఫెడరల్ వ్యవస్థ దెబ్బతింటాయి. ఇప్పటికే యూనియన్ ప్రభుత్వం జాప్యం వల్ల, పెడసరి ధోరణి వల్ల చాలా నష్టం జరిగింది. 2019 ఎన్నికల తరువాత రాష్ట్ర ప్రయోజనాలని, దేశ ఐక్యతని కాపాడే రీతిలో నిర్మాణాత్మక పరిష్కారాన్ని సాధించటానికి అన్ని వర్గాలు సంఘటితంగా పనిచేయటం అవసరం. రాజకీయ విద్వేషాలతో, తాత్కాలిక అధికార కాంక్షతో, మన వేళ్ళతో మన కళ్ళనే పొడుచుకుంటే నష్టపోయేది తెలుగు ప్రజలు, జాతి ఐక్యత. ❐

# పార్టీ ఫిరాయిస్తే వెంటనే వేటు పడాలి

ఓటుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే వారిపై వెంటనే అనర్హత వేటు వేసేలా చట్టబద్ధ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, మార్పు ఫౌండేషన్ ఛైర్మన్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు.

హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ, పార్టీ మారితే అనర్హత వేటు వేసేలా ప్రస్తుతం శాసనసభాపతి చేతిలో ఉన్న అధికారం దుర్వినియోగమవుతోందని వారన్నారు. మన దేశ వ్యవస్థలో స్పీకర్ అధికార పార్టీకి చెందిన వ్యక్తే కాకుండా.. పదవి దిగాక మళ్లీ యధావిధిగా మళ్లీ అదే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనటం ఇందుకు ప్రధాన కారణమన్నారు. స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరించకుండా తగిన సంస్థాగత ఏర్పాట్లు మన వ్యవస్థలో లేవన్నారు. ఈ నేపథ్యంలో, ఫిరాయింపులపై చర్య తీసుకునే అధికారాన్ని ఎన్నికల కమిషన్‌కి అప్పగించాలన్నారు. ఫిరాయింపులకు పాల్పడగానే పదవి రద్దయిపోతే వెంటనే ఎన్నికలకు వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల ఎన్నికల్లో గెలవగలిగినవారిలో కూడా భయం ఏర్పడుతుందని అన్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల సార్వభౌమాధికారం పరిరక్షించబడుతుందన్నారు. ఈ విషయంపై ప్రజలను చైతన్యపరిచేందుకు మార్పు ఫౌండేషన్ తరపున లక్ష కరపత్రాలు ముద్రించి పంచుతున్నామన్నారు.

నేతలు డబ్బు ఇవ్వకుంటే ఓటర్లు అడగరని.. ఇచ్చేవారుండటం, గెలిచినవారు ఏ పనీ సవ్యంగా చేయకుండా అవినీతికి పాల్పడి దోచుకుంటుండటం వల్ల ఓటర్లు కూడా అయినకాడికి దండుకుందామన్నట్లు డబ్బు పుచ్చుకుంటున్నారని రామ్మోహనరావు, కృష్ణారెడ్డి అన్నారు. మార్పు ప్రజల్లో రావాలని దాటవేసే కంటే.. ఇలాంటి ముఖ్యమైన అంశాల్లో రాజకీయ పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తే, ప్రజలు కూడా స్వాగతించి మద్దతిస్తారన్నారు. దేశానికి దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత నాయకులది, రాజకీయ పార్టీలదని, ప్రజల ఆకాంక్షలంటూ తమ తప్పిదాల్ని ప్రజల మీదకి నెట్టి ఎల్లకాలం తప్పించుకోలేరన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా చిన్నకాపవరం గ్రామంలో 2009లో పంచాయతీ ఎన్నికల్లో చోటు చేసుకున్న



ఒక ఘటనను ఈ సందర్భంగా వారు ఉదహరించారు.

ఎన్నికల పేరుతో చేస్తున్న తనిఖీలలో తెలుగునాట రాజకీయ నేతల డబ్బు పట్టుబడటం లేదని, సామాన్య ప్రజలు ఇంట్లో పెళ్లి కోసమో, వ్యాపార అవసరాల కోసమో తీసుకెళుతున్న డబ్బే ఎక్కువగా దొరుకుతోందని వారన్నారు. ఓటుకు నోట్లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నవారు ఎన్నికల సంఘాన్ని లెక్కలోకి కూడా తీసుకోకుండా పనికానిచ్చేస్తున్నారన్నారు.

ప్రస్తుతం మన దేశంలో ఉన్న ఎన్నికల వ్యవస్థ కూడా ఈ వైఫల్యాలకు కారణంగా ఉందని రామ్మోహనరావు, కృష్ణారెడ్డి అన్నారు. ఎంతశాతం మంది ప్రజల మద్దతు ఉంది అని కాకుండా.. మిగిలిన అభ్యర్థుల కంటే ఒక్క ఓటు ఎక్కువ వస్తే చాలు ఆ అభ్యర్థి గెలిచినట్లే అన్న మన ఎన్నికల విధానం (ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ సిస్టం- ఎఫ్‌పీటీపీ) వల్ల- తమ ఓటు వేస్టవుతోంది, తమకు పాలనలో భాగస్వామ్యం లేదు అనే భావన అత్యధిక సంఖ్యాక ప్రజల్లో కలుగుతోందన్నారు. ప్రపంచంలోని 160 ప్రజాస్వామ్య దేశాల్లో 116 దేశాల్లో ఆయా పార్టీలకు నమోదైన ఓటింగ్ శాతాన్ని బట్టి ఏదోకరూపంలో పాలనలో భాగస్వామ్యం లభిస్తోందన్నారు. మనదేశంలో మాత్రం ఒక్క ఓటు ఎక్కువ వచ్చినవారు మినహా మిగిలిన అభ్యర్థులందరూ ఓడిపోయిన వారే అవుతున్నారన్నారు. మరోవైపు, డబ్బు ప్రవహిస్తూ ఫిరాయింపులు పెరుగుతున్నాయన్నారు. వీటిని మార్చేలా ఎన్నికల సంస్కరణలను సాధించగలిగితేనే సమర్థులు, నిజాయతీపరులు తిరిగి రాజకీయాల్లోకి రాగలుగుతారని, ఎన్నికల్లోనే కాకుండా ఎన్నికల మధ్య కూడా పాలనలో ప్రజలు భాగస్వాములై తమ జీవితాల్ని మెరుగుపరచుకోగలుగుతారని వారన్నారు. ❐

# ఎన్నికల్లో సాధించే విజయం గురించి తక్కువ ఆలోచించండి,

## రాజ్యాంగ దార్శనికతను ముందుకు తీసుకెళ్లటంలో అంతిమ విజయాల గురించి అధికంగా ఆలోచించండి

**- జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి,**
సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి



సామాజిక న్యాయసాధన కోసం భారత రాజ్యాంగానికి కట్టుబడి అది అనుమతిస్తున్న సామాజిక కార్యాచరణను ప్రోత్సహిస్తూ ప్రజాగాయకుడు గద్దర్ ఒక సామాజికోద్యమాన్ని ప్రారంభిస్తున్నారని విని ఎంతో సంతోషించాను. ఈ బృహత్తర కార్యక్రమానికి 'సేవ్ డెమోక్రసీ, సేవ్ కాన్‌స్టిట్యూషన్' (ఎస్‌డీఎస్‌సీ) అనే పేరు పెట్టారని విని మరీ సంతోషించాను. రాజ్యాంగ సంవిధానం పరిమితులతో, అది కలిగించే ప్రయోజనాలతోనూ, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణలతోనూ నాలుగు దశాబ్దాలుగా న్యాయవాదిగా, న్యాయమూర్తిగా కుస్తీపట్టినవాడిని. సామాజిక న్యాయం కోసం క్రియాశీలంగా పనిచేస్తున్నామని బాహాటంగా ప్రకటించు కుంటున్న చాలామంది బాబాసాహెబ్ అంబేడ్కర్ మార్గ దర్శకత్వం కింద నిర్మితమైన భారత రాజ్యాంగం ప్రథమ లక్ష్యం సామాజిక న్యాయమేనని స్పష్టంగా వాదించలేకపోవడం నా జీవిత పర్యంతం విచారాన్ని కలిగిస్తూ వస్తోంది. అత్యంత శక్తిమంతంగా తమ వాణిని వినిపిస్తున్న (సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో) కొంతమంది సైతం రాజ్యాంగ చట్రం తమకు సాధికారత ఇవ్వలేకపోతున్నదనీ, వాస్తవానికి అది తమకు అవరోధంగా ఉంటోందనీ వ్యాఖ్యానించడం నన్ను తీవ్రంగా కలవరపెడుతోంది.

### మానవ గౌరవం సర్వోన్నత లక్ష్యం

మానవ గౌరవం పట్ల అంకితభావం, మానవాళిని కాపాడాల్సిన అవసరం నాడు రాజ్యాంగసభ చర్చల్లో 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం' రూపొందించే ఆలోచనకు ప్రేరణ కలిగించాయి. మహోన్నతమైన సామాజిక న్యాయం నిజంగానే శక్తిమంతమైన మానవ భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. అంతేకాకుండా అది హింసకు దారి తీసే అవకాశం కూడా ఉంది. అయితే సామాజిక న్యాయాన్ని సాధించే సామాజిక కార్యాచరణ రూపకల్పనకు హింస ఒక సమస్యాత్మక వాహకం అన్నది చారిత్రక సత్యం. ఇది అంతర్గత సమస్య మాత్రమే కాదు. దీని పర్యవసానాలు సైతం సమస్యాత్మకమైనవే.

రాజకీయ పార్టీలు తమ సభ్యుల్లో కొందరిని హింసాత్మక చర్యలకు దింపుతున్న ధోరణి పెరుగుతోంది. ఎన్నికలతో ముడిపడిన రాజకీయాల్లో హింసను అంతర్గత భాగం చేస్తున్నారు. నిజమైన ప్రజాస్వామిక ప్రక్రియను ధ్వంసం చేస్తూ సామాజిక న్యాయం అనే రాజ్యాంగ లక్ష్య సాధనను అసాధ్యం చేస్తున్న శక్తులకు వ్యతిరేకంగా నిలవాల్సిన బాధ్యత సామాజిక బృందాలు, సామాజిక ఉద్యమాలపై ఉంది.

భారత రాజ్యాంగం ముసాయిదాను ఆమోదించిన సందర్భంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఈ విషయాన్ని అద్భుతంగా (ఎప్పటిలాగే) ప్రస్తావించారు: "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు సూత్రాలను ఒక త్రయంలోని వేరు విభాగాలుగా భావించకూడదు. ఈ మూడింట్లో ఒకదాన్ని మరొకదాన్నుంచి విడదీసి చూడటం అంటే ప్రజాస్వామ్య లక్ష్యమే ఓడిపోతుందనే అర్థంలో వీటిని విడదీయలేని త్రయంగా రూపొందించారు. సమానత్వం లేకుండా స్వేచ్ఛ అనేది అనేకమందిపై కొద్దిమంది ఆధిక్యతకు వీలు కల్పిస్తుంది. అలాగే స్వేచ్ఛలేని సమానత్వం వ్యక్తిగత చొరవను చంపేస్తుంది. సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛ, సమానత్వం అనేవి సహజ క్రమాన్ని సంతరించుకోలేవు. అలాంటి స్థితిలో వాటిని ఒక కానిస్టేబుల్ మాత్రమే అమలు చేయాల్సి ఉంటుంది".

బాబాసాహెబ్ అంబేడ్కర్ ఈ విషయాన్ని మరింతగా నొక్కి చెప్తూ భారత సమాజంలో రెండు కీలకమయిన అంశాలు కనిపించడం లేదన్నారు. దీనివల్లే బౌద్ధ భిక్షువుల కాలంలో భారతదేశం అభివృద్ధి చేసిన ప్రజాస్వామ్యం ప్రస్తుతం ప్రేరణ కోల్పోయిందని ఆయన అభిప్రాయం.

వీటిలో మొదటిది సమానత్వం. దీన్నే ప్రత్యేకంగా పేర్కొంటూ అంబేద్కర్, సామాజిక, ఆర్థిక రంగాల్లో విస్తృతమైన, కొట్టొచ్చినట్లు కనబడే అసమానత్వాన్ని మనం అనుమతించినట్లయితే రాజకీయ ప్రజాస్వామ్యం తనంతట తానుగా పేలిపోయే అవకాశాలు మిక్కుటంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్క్సిస్టు దృక్పథంలో ప్రజలు తిరగబడతారనే అర్థంలో అంబేద్కర్ చెప్పలేదని నా నమ్మకం. పైగా భ్రమలు నశించిన ప్రజలు నిస్పృహలతో బలమైన నేతల పట్ల స్వామిభక్తిని, విశ్వాసాన్ని ప్రదర్శించడం ప్రారంభిస్తారని, దీంతో ఇలాంటి బలమైన నేతలు 'ఇతరుల'ను దాడి చేసి నిర్మూలించదగ్గ శత్రువులుగా నిర్వచిస్తూ, ప్రాథమిక అస్తిత్వాలను సైతం సులభంగా మరుగుపరుస్తారని కూడా అంబేద్కర్ భావించినట్లు నేను నమ్ముతున్నాను.

ఆర్థిక అసమానత్వం పెరుగుతోందని ఒకరి తర్వాత ఒకరుగా అర్థశాస్త్రజ్ఞులు ఎత్తిచూపుతుండటం, నయా ఉదారవాద వ్యవస్థ లక్షణం సహజంగానే వెనుకబాటుతనపు దురవస్థలను మరింతగా పెంచుతున్నందున సామాజిక, ఆర్థిక నిచ్చెనలో సామాన్య ప్రజల అవకాశాలు, ఆశలు కుదించుకుపోతున్నాయి. దీంతో ప్రపంచమంతటా ఇతరుల పట్ల ద్వేషాన్ని వ్యాప్తి చేసే శక్తిమంతుల పెరుగుదల కోసం మనం ఎదురు చూడాల్సి వచ్చింది. ఇది గత నాలుగైదు దశాబ్దాల్లో ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, నైతిక క్రమంపై ఆధిపత్యం చలాయించడానికి సిద్ధమై వచ్చిన అనైతిక రాజకీయ అర్థశాస్త్రపు సహజ పరిణామమే.

### అడుగంటుతున్న సౌభ్రాతృత్వం

ఘోరమైన కుల దొంతరలు, అంతస్తుల కారణంగా అసమ సమాజంలో అమలు జరుగుతున్న ఘోరమైన విధానాలతో భారతీయ సమాజంలో సౌభ్రాతృత్వం క్షీణించిపోవడం పట్ల అంబేద్కర్ కలవరపడ్డారు. 'సౌభ్రాతృత్వం అంటే ఏమిటి' అని ఆయన ప్రశ్నిస్తూనే, 'సమస్త భారతీయుల ఉమ్మడి సోదరత్వం – భారతీయులు ఒకే ప్రజ అనే భావమేనం'టూ సమాధానం చెప్పారు. 'ఇది సామాజిక జీవితంలో ఐక్యత, సంఘీభావాన్ని ఇచ్చే సూత్రం. దీన్ని సాధించడం కష్టతరం' అని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే భారతీయులమైన మనం వర్గాలుగానే కాకుండా అంతస్తులవారీ అసమానత్వంతో కూడిన కులాలుగా వేరు చేయబడి ఉన్నాం. ఇదే మనల్ని అమానవీకరణ పాలు చేస్తోంది.

దురదృష్టవశాత్తూ, భారతీయ కులీనులు ప్రోత్సహించిన 'దురాశ మంచిదే' అనే రకం రాజకీయ అర్థశాస్త్ర విధానంలో, – కొంతమంది హేతుబద్ధమైన వ్యక్తులు సైతం, ఇది పెట్టుబడిదారీ విధానపు కొల్లగొట్టే రూపంగా ఉత్పరివర్తనం చెందిందని, దీనిలోంచి పుట్టిన ఆశ్రితపక్షపాతం రాజ్యాంగవ్యవస్థల ప్రాణాధారాలను కూడా కబళించేస్తోందని చెబుతూ వస్తున్నారు– రాజ్యాంగ నిర్మాతలు వివరించిన ప్రాథమిక లక్ష్యం (మన జాతీయ అస్తిత్వ హేతువు) గురించి మాట్లాడటాన్ని కూడా మనం ప్రస్తుతం ఆపివేశాం. ప్రభుత్వ విధానం అనుసరించే ఆదేశ సూత్రాలను, ప్రత్యేకించి ఆర్టికల్ 38, 39 (బి)ని గురించి కొన్ని రాజకీయ పార్టీలు ఇప్పుడు మాట్లాడుతున్నాయి. మనది పెరుగుతున్న యువతరం కలిగిన దేశం. మన జాతీయ జనాభా రానురాను తరుణ వయస్సులోకి మారుతోంది. 60 నుంచి 70 శాతం వరకు జాతీయ సంపద జనాభాలో ఒక్క శాతం మంది చేతుల్లో ఉండటంతో అసమానత్వం వేగంగా పెరుగుతోంది. అంటే అతికొద్ది మంది వ్యక్తులు అనేకమంది జీవితాలను పణంగా పెట్టి అందరి సంక్షేమం నుంచి కొందరి సంక్షేమం వైపుగా ప్రభుత్వ విధానాలను మళ్లించి, కైవసం చేసుకుంటున్నారని ఇది సూచిస్తోంది. దీని ఫలితంగా పుట్టుకొస్తున్న అసంతృప్తి జనాభాపరంగా మనకున్న సానుకూలతను జనాభాపరమైన విధ్వంసంగా మార్చివేస్తోంది.

రాజ్యాంగ నిర్మాతలు మన రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రభుత్వ వ్యవహారాలకు చెందిన ప్రధాన లక్ష్యాలలో ఒకటైన 'జాతినిర్మాణ ప్రయత్నంలో పాటించాల్సిన నైతిక ప్రమాణం' నయా ఉదారవాద శక్తుల దాడి వల్ల ఒక పద్ధతి ప్రకారం నిర్మూలించబడింది. అయితే ఇక్కడ నేను మరొక విషయాన్ని తప్పక జోడించాల్సి ఉంది. మన రాజ్యాంగపు నైతిక కట్టడంపై అది నిర్మించదలిచిన రాజ్యపాలనపై మతఛాందస వాదుల దాడి అనేది శూన్యం లోంచి పుట్టుకురాలేదు. హింసను ప్రబోధిస్తున్న మిలిటెంట్ వామపక్షం కూడా మన రాజ్యాంగ నైతికతపై దాడిలో తక్కువ పాత్ర పోషించడం లేదు. సమసమాజ లక్ష్యాల సాధన ప్రక్రియలో మందకొడి, జాప్యందారీ విధానాల వల్ల రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాల సాధన అసాధ్యమై పోతుండటంతో, వామపక్ష అతివాదులు మన రాజ్యాంగం పేర్కొన్న నైతిక ప్రమాణాలను పద్ధతి ప్రకారం కించపరుస్తున్నారు. రాజ్యాంగ నిర్మాణాన్ని నిష్ఫలమైనదిగా ముద్రవేయడం ద్వారా వీరు యువతను నిస్పృహలో ముంచెత్తుతున్నారు. అదే సమయంలో ఉదారవాద రాజ్యాంగవాదులు ప్రజాస్వామ్యాన్ని క్రమవిధానంతో కూడిన

దృక్పథంతో మాత్రమే చూస్తూ వస్తున్నారు తప్పితే.. అణగారిన వర్గాల సహజసిద్ధమైన గౌరవానికి అనుగుణంగా గుర్తించదగిన జీవన నాణ్యతా ప్రయోజనాలను కల్పించడం గురించి స్పష్టంగా మాట్లాడటం లేదు. ఈ విధంగా వీరు పరిపాలన, రాజ్యాంగ సంవిధానానికి సంబంధించిన మౌలిక వ్యవస్థలను హరింపచేస్తున్నారు. ఇది మన వ్యవస్థలో బోలుతనంతో కూడిన అనైతిక స్థితిని తయారుచేస్తోంది. ఇక్కడే ఫాసిస్టు శక్తులు తమ విభజన రాజకీయాల విషాన్ని మరింత సమర్థంగా చొప్పించేస్తున్నాయి. మనం దీనికి మూల్యాన్ని చెల్లిస్తున్నాము. ఈ పరిస్థితిని మనం పూర్తిగా మార్చాల్సి ఉంది.

### అలక్ష్యానికి గురైనవారి వేదిక

రాజ్యాంగ సందేశాన్ని ప్రజలలోకి తీసుకుపోవడానికి ప్రయత్నించే ప్రతి నూతన సామాజిక ఉద్యమ ప్రారంభం సందర్భంగా నా హృదయంలో కాస్త ఆశలు మోసులెత్తేవి. ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఈ బృందం నిజంగానే రాజ్యాంగ నైతికతను అర్థం చేసుకుని సంపదలు కోల్పోయిన వారికీ, అలక్ష్యానికి గురైన వారికీ రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆకాంక్షలను నెరవేర్చుకునే విషయంలో మానవ గౌరవాన్ని, సౌభ్రాతృత్వాన్ని నిలబెట్టే విధంగా ఒక వేదికను అందిస్తుందని నేను ప్రతి సందర్భంలోనూ ఆశించేవాడిని. రాజ్యాంగం, రాజ్యాంగ ప్రాసంగికత గురించి రాజకీయ క్రమాలు, వ్యవస్థలకు సంబంధించిన సమాచారాన్ని వీరు పూర్తిగా తెలియపరుస్తారనీ, తద్వారా అధికారంలో ఉన్న శక్తులు సామాజిక న్యాయాన్ని మరింత సంపూర్ణంగా ప్రోత్సహించే విధానాలను రూపొందించి అమలు చేస్తాయని నేను ఆశించేవాడిని. 'మన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో రాజ్యాంగ పద్ధతులను ఎత్తిపడుతుందనీ, రక్తపాత విప్లవ పద్ధతులను పరిత్యజిస్తుందని' ఆనాడు బాబాసాహెబ్ ఆశించారు. ఇప్పుడు ఏర్పడుతున్న నూతన సామాజిక ఉద్యమం కూడా అలాంటి ఆశను మళ్లీ కలిగిస్తోంది. పైగా ప్రారంభమయ్యే ప్రతి నూతన సామాజిక ఉద్యమం కూడా 'అంతర్గత పార్టీ ప్రజాస్వామ్యాన్ని చురుకుగా ప్రోత్సహిస్తుందని, వ్యక్తి స్వేచ్ఛలను గొప్ప వ్యక్తుల పాదాల కింద పరిచే పద్ధతులను ప్రోత్సహించదని, లేక సంస్థలను పక్కన పెట్టే తరహా అధికారాలను అంటగట్టే రీతిలో వారిని విశ్వసించదని నేను నమ్ముతున్నాను. మతంలో భక్తి అనేది ఆత్మల విముక్తికి మార్గం కావచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి లేక వీరపూజ అనేవి పతనానికీ, నియంతృత్వానికీ అనివార్యంగా బాటలు వేస్తాయి.'

గొప్ప చింతనాపరులు, ప్రజాకవులు గాఢమైన అంతర్దృష్టిని కలిగి ఉంటారు. తమకు జరిగే అవమానం వారిని అపరిమిత అధికారాన్ని ప్రశ్నించేందుకు పురిగొల్పుతుంది, సామాన్య ప్రజల అభిమతాన్ని దృష్టిలోకి తీసుకోని విధంగా వ్యవహరించే అన్యాయానికి సంబంధించిన కొలమానాలను అర్థం చేసుకునే సహానుభూతి వారికి ఉంటుంది. ఈ తత్వం సామాజిక ఉద్యమంలో అంతర్గత తనిఖీలకు ఉపయోగపడుతుంది. వ్యక్తం చేసే విలువల మధ్య వైరుధ్యం గురించి చేసే ఆకాశాన్నంటే వాగాడంబరం, అమానవీకరించే కేంద్రీకృత అధికారం పట్ల దురాశ పెరిగిపోవడాన్ని జాగ్రత్తగా గమనిస్తే అవి వ్యవస్థ సంస్కరణలకు వనరులు అవుతాయి. ఈ నూతన సామాజిక ఉద్యమ నిర్వాహకులు ఈ అంశం పట్ల నిరంతరం దృష్టి పెడతారని నేను ఆశిస్తున్నాను.

మన రాజ్యాంగం ఊహించిన గొప్ప నైతిక విప్లవాన్ని తీసుకురావడం కోసం జరిగే ప్రయత్నాలను విజయం లేదా పరాజయం అనే సాధారణ కొలమానాల నుంచి అంచనా వేయలేం. అంబేద్కర్ నుంచి రామ్ మనోహర్ లోహియా వరకు ఈ దేశంలోని అతిగొప్ప చింతనాపరులు, నైతిక ధీర నాయకుల్లో కొందరు ఎన్నికల్లో కానీ ఇతరత్రా కానీ తక్షణ విజయాలను సాధించలేదన్నది తెలిసిన విషయమే. కానీ వారి ఉజ్వల దార్శనికత, నైతిక ధృతి తరం తర్వాత తరాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఈ కొత్త సామాజిక ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న నాయకులకు నా సలహా ఇదే.

ఈ ఎన్నికల్లోనూ లేక మరో ఎన్నికల్లోనూ సాధించే విజయం గురించి తక్కువగా ఆలోచించండి, రాజ్యాంగ దార్శనికతను ముందుకు తీసుకుని పోవడంలో సాధించే అంతిమ విజయాల గురించి అధికంగా ఆలోచించండి. అధికారంలో ఉన్న వారికి రాజ్యాంగతత్వం గురించి నిత్యం ఎత్తిచూపుతుండటమే మీ లక్ష్యం కావాలి. మన రాజ్యాంగం వ్యవస్థీకరించిన 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం' ఒక్కటి మాత్రమే సమస్త ప్రజల గౌరవానికి హామీని ఇవ్వగలదని, అదొక్కటి మాత్రమే వారి మధ్య సోదరత్వాన్ని పరిరక్షించగలదని మీరు మన యువతీ యువకులకు నిత్యం చెబుతూ ఉండండి.

**(రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'సేవ్ డెమోక్రసీ, సేవ్ కాన్‌స్టిట్యూషన్' ఉద్యమం వ్యవస్థాపక సభకు పంపిన సందేశం సంక్షిప్త రూపం)** ❐

(కర్టెసీ: సాక్షి)

# శాశ్వత మిత్రులు - శాశ్వత శత్రువులు .. శాశ్వత పిచ్చివెధవలు

- పి.వి గోపాలకృష్ణ



ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన పదిహేను రోజుల్లోనే దేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాలలో, కేంద్రపాలిత ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తూండగా పట్టుబడిన నగదు విలువ 143 కోట్ల 47 లక్షలు. 2014 ఎన్నికలలో పట్టుబడ్డ మొత్తం నగదులో ఇది ఏభై శాతం. అప్పుడు పట్టుబడ్డ మొత్తం నగదు విలువ 304 కోట్లు. ఈ ఎన్నికల సమయంలో తొలినాళ్లలోనే నగదుతోపాటు ఉచితంగా సరఫరా చెయ్యడానికి అక్రమంగా తరలిస్తున్న మద్యం, ఇతర వస్తువుల మొత్తం విలువ 600 కోట్లు. భారత ఎన్నికల కమిషన్ పత్రికలకి, ప్రసార మాధ్యమాలకి విడుదల చేసిన రిపోర్ట్‌లో ఈ విషయాల వివరాలున్నాయి.

ప్రతి ఎన్నికలప్పుడూ అక్రమ నగదు రవాణా, దాన్ని నిలువరించడానికి పోలీసు, ఆదాయపన్ను శాఖ వారు కాపుకాసి పట్టుకోడం అన్న వార్త మరో ఎన్నికల స్టాటిస్టిక్. ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ పద్ధతిలో జరిగే మన ఎన్నికలలో ఎలాగోలా గెలవడమే ముఖ్యంగా మారాకా రాజకీయ పార్టీలలో నిబద్ధత లేకపోడం వల్ల దేశానికి పట్టుకున్న అంటురోగం ఇది. శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న ఒక్క సిద్ధాంతం తప్ప మరే సిద్ధాంతాలు పట్టని సిగ్గులేని రాజకీయ నాయకులు ఆడే అధికార క్రీడలో ఓట్లు కొనుక్కోడం అనివార్యంగా మారింది. అది నిరాటంకంగా కొనసాగడానికి కారణం పట్టుబడేది కేవలం టిప్ ఆఫ్ ఏన్ ఐస్‌బర్గ్.

పట్టుబడ్డ నగదులో చాలా భాగం స్వంతదారులు లెక్కచూపించిన చట్టబద్ధమైన నగదేనని రుజువు చేసుకున్న తర్వాత తిరిగి ఇచ్చేయడం జరుగుతుంది. 2014 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ఆ విధంగా పట్టుబడ్డ నగదు ఎంత, ఎంతమంది ఆ నగదు వెనక్కి తీసుకున్నారు, తీసుకోనివారి వివరాలు, నగదు విలువ, ఆ సమాచారం అధికారికంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశాను.

సమాచార హక్కు చట్టం ప్రజలందరికి ప్రభుత్వ సమాచారం అంతా అందుబాటులో ఉండాలన్న సదుద్దేశంతో ప్రజల కోసం ప్రజలే చేసుకున్న ప్రజల యొక్క చట్టం. ఈ చట్టం ఏ పద్ధతిలో ప్రజలు సమాచారాన్ని పొందాలో నిర్దేశిస్తుంది. ఆ నిర్దేశనలని పాటిస్తే ఏంటవుతుందో ఇప్పుడు చూద్దాం.

సెక్షన్ 6(1) కింద జనవరి 29న దరఖాస్తు చేసుకుంటే దాని ప్రతిని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలోని సంబంధిత ప్రజా సమాచారాధికారి ఫిబ్రవరి 22న జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాల్లోని ప్రజా సమాచార అధికారులకి సమాచారాన్ని ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ సెక్షన్ 6(3) కింద పంపించారు.

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (అడ్మిన్) వారు దానిని ఫిబ్రవరి 25న దరఖాస్తు దారుడికి సమాధానం పంపవలసినదిగా కోరుతూ అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్స్) వారికి సెక్షన్ 6(3) కింద పంపించారు.

శ్రీ జాయింట్ కమిషనర్ (ఎలక్షన్స్), జీహెచ్ఎంసీ వారు దరఖాస్తుదారుడు కోరిన సమాచారం నోడల్ ఆఫీసర్ ఫర్ మోడల్ కాండక్ట్, విజిలెన్స్, జీహెచ్ఎంసీ వారి వద్ద

ఉంటుందని, వారికి ఈ దరఖాస్తును పంపవలసిందిగా కోరుతూ మార్చ్ 18న చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌కి సెక్షన్ 6(3) కింద పంపించారు.

మార్చ్ 16న చీఫ్ ఫైనాన్షియల్ అడ్వయిజర్, జీహెచ్ఎంసీ పాక్షిక సమాచారాన్నిస్తూ 3 కోట్ల 17 లక్షల 8 వేల 703 రూపాయలు తిరిగి చెల్లించినట్లు చెబుతూ మిగిలిన సమాచారం పోలీస్, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వారినడగవలసినదిగా చెప్పేరు.

నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయము వారు సమాచారం తమ వద్ద లేనందువల్ల దరఖాస్తును ప్రజాసమాచార అధికారి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ అధికారి కార్యాలయము మరియు నోడల్ అధికారి (ఎంసీసీ), నిజామాబాద్ వారికి మార్చ్ 5న సెక్షన్ 6(3) కింద పంపించేరు. డీసీఓ/నోడల్ ఆఫీసర్ (ఎంసీసీ), నిజామాబాద్ వారు మార్చ్ 19న కోరిన సమాచారాన్ని పాక్షికంగా కోరిన పట్టికలో తెలియచేశారు.

జగిత్యాల కలెక్టర్ కార్యాలయంవారు దరఖాస్తును నెంబర్లు 20–కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం, 21–జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం, 22–ధర్మపురి (ఎస్.సి) అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్లకి కోరిన సమాచారం ఇవ్వవలసిందిగా కోరుతూ మార్చ్ 14న సెక్షన్ 6(3) కింద పంపించేరు.

రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, షాద్‌నగర్ వారు మార్చ్ 11న కోరిన సమాచారాన్ని పాక్షికంగా కోరిన పట్టికలో తెలియజేశారు.


దీనివల్ల మనకర్థమయ్యేదేమిటంటే రాష్ట్రవ్యాప్తంగా పట్టుకున్న నగదు వార్తలను ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా పత్రికలకు, ప్రసారమాధ్యమాలకు ఆ సమయంలో అందించినా, ఎన్నికలయిపోయిన తరవాత ఆ వివరాల జోలికి పోడంలేదు. ఆ వివరాలు ఎవరి దగ్గరుంటాయన్న స్పష్టత కూడా వారికి లేదు. సెక్షన్ 6(3) అన్న ఫుట్‌బాల్ ఫీల్డ్‌లో మిడ్ ఫీల్డ్, డిఫెన్స్, ఫార్వార్డ్‌ల మధ్య ఒకరికొకరు సమాచారం అందించుకుంటూ దరఖాస్తు గోల్ చేరకుండా తంతున్నారు. ముప్పై రోజులలో సమాచారం ఇవ్వాలన్న నిర్దేశం ఉన్నా జనవరి 29న చేసుకున్న దరఖాస్తు మీద కేవలం రెండు ప్రభుత్వ కార్యాలయాల నుంచి మాత్రమే సమాచారం వచ్చింది. అది కూడా పాక్షికంగానే.

చీఫ్ ఫైనాన్షియల్ అడ్వయిజర్, జీహెచ్ఎంసీ, నిజామాబాద్, షాద్‌నగర్ కలెక్టర్ కార్యాలయాల నుంచి కోరిన పట్టికలో సమాచారం వచ్చినా అది పాక్షికంగానే ఉందని అనడానికి కారణం ఉంది.

వివరాలను ఒక ప్రత్యేకమైన పట్టిక రూపంలో అడగటంతోపాటు మరో ముఖ్యమైన ప్రశ్న కూడా ఆ దరఖాస్తులో ఉంది.

సెక్షన్ 4 కింద నగదు సంబంధించి అడిగిన సమాచార వివరాలు ఎందువల్ల వారి వెబ్‌సైట్లలో పెట్టి ప్రజలకు ఆ సమాచారం అందుబాటులో ఉంచలేదు అన్న ప్రశ్నకి జవాబు చెప్పవలసిన బాధ్యత ప్రధాన ఎన్నికల అధికారికి, ఆర్‌డీఓలకి, కలెక్టర్లకి, కమిషనర్లకి ఉంది. చట్టంలో సెక్షన్ 4(2) స్పష్టంగా నిర్దేశించి ఉన్నా ఏ పబ్లిక్ అథారిటీ కూడా ఈ విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఇక శాశ్వత పిచ్చివెధవలెవరూ అంటే – జనం అని అనుకునేవాళ్లే. ❐




**"జన్మతః క్రమశిక్షణగల వారిని పుట్టుకతోనే ప్రజాస్వామ్య వాదులనుకోవచ్చు! చట్టాలకు బద్ధులై ఉండటాన్ని ఒక అలవాటుగా చేసుకున్న వ్యక్తికి ప్రజాస్వామ్యం సహజంగానే అబ్బుతుంది".**

**– గాంధీజీ**

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ *తెలంగాణలో ఆంధ్రులను కొడుతున్నారనే వ్యాఖ్య చేసినందుకు పవన్‌కల్యాణ్‌ను తెలుగుజాతి క్షమించదు. పవన్ లోగడ తన సినిమా రిలీజైనప్పుడు కేసీఆర్‌ను కలుసుకున్నారు. ఆయన నాయకత్వ లక్షణాలను పొగిడారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో తాను టీఆర్ఎస్‌కే ఓటు వేశానంటూ నాగబాబు ప్రకటించారు. రాజకీయ లబ్ధి కోసం రెండు రాష్ట్రాల మధ్య ద్వేషం రగిలించే వ్యాఖ్యలు పవన్ కల్యాణ్ వంటి వ్యక్తి చేస్తారని ఎవరూ ఊహించి ఉండరు.*

*– కె. రామచంద్రమూర్తి, సీనియర్ సంపాదకులు*

■ *ఆశ లేశమైనా మిగలని ప్రజలను తయారుచేయడమే పరమావధిగా పార్టీలన్నీ పథకాలను గుమ్మరిస్తున్నాయి. లేకపోతే ఇప్పుడు 'కనీస ఆదాయాలు' వరించేవా? 'రైతుబంధు'వులు పలకరించేవారా? 'కల్యాణ లక్ష్ములు' కళకళలాడేవారా? 'షాదీ ముబారక్'లు సలామ్ చేసేవా? 'పసుపు కుంకుమలు' శోభిల్లేవా? 'ఆయుష్మాన్' భవ అనే దీవెనలు అందేవా? అవేమైనా జేబులో డబ్బుతో అమలు చేసేవా? ఆమ్యామ్యాలు, బెదిరింపులు, కుంభకోణాలతో వెనకేసుకున్న మూటలు పంచి నెరవేర్చేవా? ముక్కు పిండీ మూతి పిండీ జనం దగ్గర్నుంచి పన్నులు వసూలు చేసి నింపిన ప్రభుత్వ ఖజానాలోంచి తీసి ఖర్చు పెట్టేదే కదా. తనది కాకపోతే కాశీకేం ఖర్మ.. ప్రపంచం మొత్తమైనా దేకమనచ్చు. పైగా పేరుకు పేరు, అధికారానికి అధికారం.*

*– పున్న సుదర్శన్*

■ ***తెలంగాణ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు రూ.1200 కోట్ల వరకు పంపకాలు జరుగుతున్నట్లు అంచనా. కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే నియోజకవర్గాలలో డబ్బు పంపిణీ విషయంలో 'తగ్గొద్దని' తెరాస అంచనా కొచ్చినట్లు ఆ పార్టీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో గత డిసెంబరు శాసనసభ ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థులూ కలిపి రూ.3,200 కోట్ల నుంచి 3,600 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన తొలి ఎన్నికల్లోనే ఇంత భారీ మొత్తంలో ఖర్చవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.***

***- ఐ.ఆర్ శ్రీనివాసరావు, వలసాల వీరభద్రం, (తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు రిపోర్టులో)***

■ *వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, వ్యాపారాలపై ప్రభుత్వం పరిమితులు విధిస్తున్న ఫలితంగా పంటను రైతు తనకు ఇష్టమైన ధరకు తనకు నచ్చిన మార్కెట్‌లో అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోంది. దీనివల్ల గడచిన 17 ఏళ్లలో రైతులు రూ.45,00,000 కోట్ల మేర ఆదాయం కోల్పోయారని అంచనా. ఇది రైతులపై పరోక్షంగా పన్నులు వేయడం కిందకే వస్తుంది. ప్రపంచంలో మరే దేశంలోనూ ఇలాంటి దారుణ పరిస్థితి లేదు.*

*- పరిటాల పురుషోత్తం, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు*

■ *నాణ్యమైన విద్యను అందించండి.. అని నేతలను డిమాండ్ చేయటానికి విద్యార్థులకు ప్రస్తుత ఎన్నికలు భారత్‌కు సరైన అవకాశం. విద్యార్థులు గట్టిగా అడగకపోతే, రాజకీయ పార్టీలు యధావిధిగా అన్నట్లు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల వృద్ధి గురించి ఊదరగొట్టి మోసాన్ని కొనసాగిస్తాయి. మంచి నాణ్యమైన విద్య మాత్రమే యువ ఓటర్లకు సాధికారతను, విముక్తిని అందించే సాధనం. మిగిలినవన్నీ దాన్ని అనుసరించే వస్తాయి.*

*- సంజయ్ కుమార్,*

*మిట్టల్ దక్షిణాసియా ఇన్‌స్టిట్యూట్ ఇండియా విభాగం, హార్వర్డ్ యూనివర్సిటీ డైరెక్టర్*

■ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ అంచనా ప్రకారమే వెళితే ప్రధాని నరేంద్ర మోదీ కూడా తప్పులు చేశారని ఆయన అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్ హయాంలో చేసిన తప్పుల కంటే మోదీ చేసిన తప్పులు తక్కువని ఆయన అభిప్రాయపడుతున్నట్లు కూడా అర్థమవుతోంది. కాని జనంలో భావోద్వేగాలు సృష్టించి, వారిలో చీలికలు ఏర్పర్చి, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఇతరులకు ప్రాముఖ్యతను పూర్తిగా తగ్గించి, వ్యవస్థలను బలహీనం చేసి, ఒక అప్రజాస్వామిక, భయావహ వాతావరణాన్ని ఏర్పర్చి, చివరకు తాను అమలుపరిచిన ప్రజానుకూల పథకాల ద్వారా మాత్రం కాక, యుద్ధవాతావరణం కల్పించడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుని గెలవాలనుకోవడం కంటే తప్ప ఘోరమైన తప్పిదం మరొకటి లేదు.

– ఎ.కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు

■ అవినీతిపై ప్రతిరోజూ వేలకువేలు ఫిర్యాదులు వస్తున్నాయి. డాక్టర్ శ్రీనివాస్ అనే ఒకాయన భువనగిరి నుంచి నాకు ఓ ఎస్ఎంఎస్ ఇచ్చాడు. ఆయన ఏ కార్యాలయాలకు పోయాడో చెప్పను. కానీ, రెండు కార్యాలయాలకు పోయాడట. రెండు కార్యాలయాల్లోనూ రూ.30వేల చొప్పున లంచం తీసుకున్నారట. లంచం ఇవ్వకపోతే పని చేయమన్నారట. దిక్కు లేక లంచం ఇచ్చానన్నాడు. ఇంత పెద్ద పాప్యులర్ ముఖ్యమంత్రివి. ఇంత పెద్ద కేసీఆర్‌వి ఉండి కూడా నువ్వు నివారించలేవా? .. నీకు చేతకాదా?.. అని ప్రశ్నించాడు. నేను సిగ్గుతో తలదించుకున్నా. ఆ తర్వాత ఆలోచన చేశా. అవినీతి ఇంత విచ్చలవిడిగా ఉండడానికి వీల్లేదని, దీన్ని నిర్మూలించాలని కఠిన నిర్ణయం తీసుకున్నాం. వందశాతం మునిసిపాలిటీలు, పంచాయతీలు, రెవెన్యూలో ఊరట లభించేలా కొత్త చట్టాలు తెస్తున్నాం.

– కె.చంద్రశేఖరరావు, తెలంగాణ ముఖ్యమంత్రి

■ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల గుర్తులపై గెలిచిన ఎమ్మెల్యేలు అధికార పార్టీ కండువా కప్పుకుంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నామని చెబుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో పలుసార్లు తాము అన్ని పార్టీల ఎమ్మెల్యేలను సమానంగా చూస్తున్నామని, అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గాలో సరిసమానంగా ఇతర పార్టీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని స్వయంగా చెప్పారు. అన్ని నియోజకవర్గాలలోనూ సమానస్థాయి అభివృద్ధి జరుగుతున్నప్పుడు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు అధికార పక్షంలో ఎందుకు చేరుతున్నట్టు? పార్టీ మారుతున్న ఈ ఎమ్మెల్యేలు చెబుతున్న అభివృద్ధి ఎవరిది? ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం నిజంగానే అభివృద్ధి చెందదా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంది. అప్పుడు టి.డి.పి, టీఆర్ఎస్ రెండూ ప్రతిపక్ష పార్టీలే. టీఆర్ఎస్‌లో ఉన్న హరీశ్‌రావు నిత్యం తెలంగాణవాదం వినిపిస్తూ, అసెంబ్లీలో, బయటా ఆంధ్రపాలకులంటూ తీవ్ర విమర్శలు చేస్తూనే తన నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల నియోజకవర్గం కంటే, హరీశ్‌రావు నియోజకవర్గానికే ముఖ్యమంత్రులు, మంత్రులు అధిక నిధులు, సంక్షేమ పథకాలు ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోయేవారు. ప్రతిపక్ష తెలుగుదేశం ఎమ్మెల్యేగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ప్రభుత్వం చేపట్టిన అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తన నియోజకవర్గంలో పూర్తిగా అమలు చేయించారు. అప్పట్లో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల కంటే ఒకింత ఎక్కువగానే ఆయన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయి. వీరిద్దరూ ఉదాహరణలు మాత్రమే. ప్రజాస్వామ్యం నాలుగు కాలాలపాటు చల్లగా ఉండాలని అధికారపక్షం నిజంగా కాంక్షించిన పక్షంలో ప్రతిపక్షానికి చట్టసభలో నిలువనివ్వాలి.

- ఎ.రమణ కుమార్, సీనియర్ జర్నలిస్టు

■ గాంధీజీ ఈవేళ మన మధ్య ఉండి ఉంటే కచ్చితంగా ఎన్నికల్ని బహిష్కరించి ఉండేవారు. దేశంలో రావాల్సిన రాజకీయ, సామాజిక మార్పులపై యువతరాన్ని చైతన్యపరుస్తూండేవారు.

– రామిన్ .జె

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది హిందూ, సోషల్ మీడియా)

# యువత స్థానిక జేపీలవ్వాలి!




***నేను నా పిల్లలకి నా దేశం గురించి చెబుతూ కొందరి పేర్లను తెలియజేస్తుంటాను. ఇండియా వెళ్లినప్పుడు వారిని చూపిస్తాను. అంతేగానీ, వర్గపోరాటాలు, కుల సంఘాలు, అభివృద్ధిలేని పాలనను చూపించాలనుకోవటం లేదు. గర్వకారణమయ్యే వ్యక్తులను భవిష్యత్తులో మరింత ఎక్కువమందిని ఇండియాలో చూపించాలని నా ఆశ.***

**- డా॥ అరుణా హాకిన్స్**, వాషింగ్టన్

**2004** సంవత్సరం డిసెంబర్ నెల 9వ తేదీ. అవినీతికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సంఘటిత ప్రతిఘటనను తెలియజేస్తున్న రోజు. భారత్‌లో డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించి అవినీతిపై పోరాటమే లక్ష్యంగా పలు రూపాల్లో విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వారి స్ఫూర్తితో అమెరికాలో కూడా మేం కార్యక్రమాలను చేపట్టాం. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని పాటించటం, కార్యక్రమాలను నిర్వహించటాన్ని ప్రారంభించిన రాజకీయ సంస్థ భారత్‌లో బహుశా లోక్‌సత్తాయేనేమో. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల దగ్గర్నుంచీ పౌర సంస్థల్లో పెద్దల వరకూ వీలైనంత మందిని భాగస్వాముల్ని చేస్తూ, చైతన్యపరుస్తూ ఈ కార్యక్రమాల్ని నిర్వహిస్తుండేవారు. ఆరోజు హైదరాబాద్ వికాస్ కాలేజీలో జరుపుతున్నారు. యాజమాన్యం, విద్యార్థుల కోరిక మీద కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. నేను అమెరికాలో ఉంటూ క్రిస్మస్ వెకేషన్‌కి ఇండియా వచ్చాను. అప్పటికే అమ్మ లోక్‌సత్తా సంస్థలో కార్యకర్తగా ఉన్నారు. నాన్నగారు వికాస్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. నేను కూడా ఆ కార్యక్రమానికి హాజరయ్యాను. అమ్మ జేపీగారికి నన్ను పరిచయం చేసింది. నేను ఎందరో గొప్పవారిని గురించి విన్నాను. కానీ ప్రత్యక్షంగా ఒక గొప్ప అధికారిని, నాయకుడ్ని, సంస్కర్తని చూడటం, పరిచయం చేసుకునే, కొద్దిసేపు మాట్లాడే అవకాశం రావడం మా అందరికీ మరచిపోలేని ఒక స్ఫూర్తిదాయక జ్ఞాపకం.

ఆ తర్వాత డాక్టర్‌గా తీరికలేకపోయినా, అమ్మ ద్వారా విశేషాలు తెలుసుకుంటూనే ఉన్నాను. జేపీ చేస్తున్న సేవ అపారమైనది. అదే వారు అమెరికాలో ఉండి ఉంటే మరింత ప్రోత్సాహం లభించి ఉండేది కదా (బరాక్ ఒబామా ఎవరో తెలియని రోజుల్లో కూడా జేపీకి అమెరికాలోని పలు మహానగరాల్లో వేలసంఖ్యలో అభిమానులున్నారు. తనకున్న ప్రతిభాపాటవాలతో, రాజకీయ సంస్కృతితో ఒబామా అనే వ్యక్తి కేవలం మూడు, నాలుగు సంవత్సరాలలో అధ్యక్ష పదవికి పోటీ పడి గెలవగలిగారు. అలాంటి రాజకీయ పార్టీలు, రాజకీయం భారతదేశంలో ఉండి ఉంటే జేపీలాంటి వారు ఈపాటికే ప్రధానమంత్రి అయిపోయి, ఇంకా చాలా మార్పుల్ని సాధించి చూపేవారు).. అనిపించినా, మనదేశానికి జేపీ అవసరం చాలా ఉంది అని భావిస్తాను. వారి అమూల్యమైన ఆలోచనలు, సలహాలు, సూచనలు, ముందుచూపు, విధానపరమైన నిజాయతీ ఎందరికో స్ఫూర్తిని కలిగిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాల్లో, ఇండియాలో రాజకీయాలు మారాలంటే, పేదరిక నిర్మూలన జరిగి అందరికీ ఎదిగే అవకాశాలు రావాలంటే.. ఆ మార్పు జేపీ గారి భావజాలం వల్లనే సాధ్యమని నేను ఎన్నో ఏళ్ల పాటు అమెరికాను కూడా పరిశీలించాక నిశ్చయంగా చెప్పగలను. వారు ఒక విత్తు నాటారు. ఒక వేదికను కల్పించారు. భావజాలాన్ని ఒక మార్గం పట్టించారు. దాన్ని అనుసరించడం, వీలైనంత త్వరగా లక్ష్యాల్ని సాధించటంలో చురుకైన పాత్ర పోషించటం యువత కర్తవ్యం. లోక్‌సత్తా భావజాలం నుంచి నాకు తెలిసి అనేక ప్రజాసంఘాలు, పౌరసంస్థలు వచ్చాయి. ఎంతో మంది స్వచ్ఛంద సంస్థల్ని నెలకొల్పుకుని పనిచేస్తున్నారు. పైకి ప్రచారం లేకుండా పలువురు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా పనులు జరిగేలా సామాన్యులకు సహాయపడుతున్నారు. లోక్‌సత్తా ఆలోచనలు, పదజాలం రాజకీయ పార్టీల్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. అన్నా హజారే ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ పోరాటానికి, ఆప్‌కు లోక్‌సత్తా ట్రాక్‌గా ఉపయోగపడింది. కొంతమేర తెలుగునాట జనసేనకు కూడా. ఇంతమంది కొత్తరాజకీయ భావజాలం గురించి మాట్లాడుతున్నా.. ఇప్పటికీ యువతకు నిఖార్సయిన మార్గదర్శకులుగా కొనసాగుతున్న వ్యక్తి జేపీ మాత్రమే. దేశం మరింతగా అభివృద్ధిని సాధించాలంటే జేపీ వంటి వారు ఎక్కడికక్కడ తయారవ్వాలి. తమ పరిధిలో జేపీలా పనిచేస్తూ యువతకు, ఇతర ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తుండాలి. 'ఒక్కరి వల్ల ఏమవుతుంది' అనే నిరాశ నుంచి 'ఒకరు ప్రారంభించిన కృషిని ఎందరో అనుసరించి తమ వంతు ప్రయత్నం చేయాలి' అని ఆత్మవిశ్వాసంతో ఆలోచిస్తే

చాలు.. అద్భుతమైన మార్పులు భారతదేశంలో ఏ తరమూ నష్టపోకుండా, సకాలంలో సాధ్యమవుతాయి.

ఇలా ఆశావాదంతో యువత.. వంశపారంపర్య పాలన పట్ల ఆగ్రహం చెందాలి. ప్రస్తుత ఎన్నికల్లో ఎంతమంది వారసులు పోటీ చేశారో లెక్కపెట్టడం కూడా కష్టమైన పరిస్థితి! జాతీయ, ప్రాంతీయ అని తేడా లేకుండా అన్ని పార్టీల్లో వారసత్వ రాజకీయాలు పెచ్చరిల్లాయి. ఇన్ని కోట్ల మంది యువతీయువకులున్న దేశంలో.. నాయకుల కొడుకులు, కుటుంబ సభ్యులు తప్ప ప్రాధాన్యతగల నాయకులెవరూ లేరా? ఇప్పటిదాకా జరుగుతున్న పరిణామాలు చూస్తే, ఒక కుటుంబంలోని వ్యక్తి ఏదో విధంగా అధికారాన్ని కావచ్చు, పదవిని కావచ్చు దక్కించుకుంటే.. ఆ తర్వాత భార్య కానీ, కుమారులు కానీ కొనసాగడమే మనం చూస్తున్నాం (కొడుకులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటేనే కూతురు, కోడలుకి అవకాశమిస్తారు). అసలు ఈ వంశపాలన జాడ్యమే సగం దేశాన్ని నాశనం చేస్తోంది. ఈరోజు ఒకరి వలన సాధ్యం కాకపోతే మరొకరు వస్తారు, రాగలరు.. అనే నమ్మకాన్ని మాకు ఇక్కడ అమెరికా కల్పించింది. అందుకు కారణం ఎన్నికల విధానం. భారతదేశానికి కూడా యధాతథంగా కాకున్నా కొంతమేర ఇటువంటి ఎన్నికల విధానాన్ని అనుసరిస్తే, ముందు రాజకీయ పార్టీలు బాగుపడతాయి. పార్టీలు సొంత ఎస్టేట్‌లులా కాకుండా, ప్రజల సంస్థలుగా పనిచేస్తాయి. ఎవరికీ తెలియని అనామకుడైనా సరే, ఎంత సామాన్యుడైనా సరే.. సమర్థత, నిబద్ధత ఉంటే ఒబామాలా వేగంగా ఎదగగలుగుతారు. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్ల మనకు ఎన్ని అభ్యంతరాలైనా ఉండొచ్చు. కానీ గత ఎన్నికలకు ముందు అతని గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. కొన్ని విధానాలను అతను ముందుకు తీసుకొచ్చి, రిపబ్లికన్ పార్టీలో ఒకట్రెండు సంవత్సరాల్లో అగ్రనాయకుడై పోయారు. అలా మనదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఒక అనామకుడు రాజకీయ పార్టీల్లో వేగంగా ఎదగటం కష్టం. అమెరికాలోలా.. పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించే ముందు తమ పార్టీ నేతల మధ్యే జరిపే ప్రాథమిక ఎన్నికలు (ప్రైమరీలు) వంటివి మనదేశంలోనూ రావాలి.

ఇక ఎన్నికల బరిలో ఇండియాలో ధనప్రభావం విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా ఎన్నికల్లో కూడా ధనజాడ్యం ఉన్నప్పటికీ, ఇది సంపన్నదేశం, ఓటింగ్, పాలన పరంగా భయంకరమైన లోపాలేమీ ఇక్కడ లేవు. కానీ ఇండియా వంటి పేదదేశంలో ఎన్నికల్లో పెట్టే ఖర్చు అమెరికాలో కంటే కూడా ఎక్కువగా ఉంటోంది. అమెరికాలో సరైన పాలన అందించకపోతే దిగిపోవటం తప్పదు. అవినీతిపరులను అక్కడ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌కి కూడా ప్రజలు అత్యంత విలువనిస్తారు. బాధ్యతగా ప్రవర్తిస్తారు. మనదేశంలో ప్రభుత్వం చేయాల్సిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి పనుల్ని సక్రమంగా చేయకపోయినా, ప్రజలేమీ పెద్దగా ప్రశ్నించరు. తమడబ్బులతో తమకు హక్కుగా రావలసిన సేవల్ని కాకుండా.. చిన్న చిన్న తాయిలాలు, ప్రలోభాలకు స్పందించి ఓటు వేస్తుంటారు. ప్రభుత్వ వాస్తవ వైఫల్యాల పట్ల ప్రజల ఉదాసీనత, నిర్లక్ష్యం విచారం కలిగిస్తాయి. చైతన్యవంతమైన ప్రజలు లేని ప్రజాస్వామ్యం కొనసాగుతుంటే.. ధనరాజకీయాలు ఇంకా ఇంకా పెరుగుతుంటాయి. స్వచ్ఛమైన పాలనను ప్రజలు కోరుకోవడం లేదా.. అని బాధ కలుగుతుంది. ఏళ్ల తరబడీ వంశపారంపర్య పాలన, డబ్బు గలవారిదే అధికారం, సామాన్యుడికి అవకాశం అందని ద్రాక్షే.. అనే నిరాశను ఛేదించాలన్న సంకల్పాన్ని బలంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ధనరాజకీయాలు, దాంతోపాటు సాగుతున్న కులరాజకీయాలను అరికట్టాలంటే యువత బాధ్యత తీసుకోవాలి. ఏమీ చేతగాకపోతే, ఒకసారి పదవిని దక్కించుకుని, ఖర్చు పెట్టిన దానికి అనేకరెట్లు రాబట్టుకుని, ఆ తర్వాత దర్జాగా కొన్ని తరాలపాటు హ్యాపీగా గడిపేయొచ్చనే ధోరణికి అడ్డుకట్ట వేయగలవారు యువత మాత్రమే! యువతీయువకులు జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉండటమేకాకుండా.. ఇప్పుడున్న అధ్వాన్న ఎన్నికల రాజకీయం వల్ల ఎక్కువ నష్టపోయేది కూడా వారే కావడం వల్ల వారే ఎక్కువ బాధ్యత తీసుకోవాలి. నేను భారత రాజ్యాంగాన్ని చదవలేదుకానీ (సారీ!) రూపకర్తలు "వారసులు అర్హులు కాకుండే ఉండే రీతిలో" ఎన్నికల వ్యవస్థను రూపొందించి ఉంటే బాగుండేది. పార్టీల పదవుల్లో, పార్టీల తరపున ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయటంలో, ఎన్నికల్లో చట్టబద్ధంగా ప్రచారం చేసి గెలవటంలో వారసులు, అనర్హులు కాకుండా.. సమర్థులు, నిజాయతీపరులు వచ్చేలా సరైన ప్రాతినిధ్య వ్యవస్థని మనం రూపొందించుకోలేకపోయామని చెప్పకతప్పదు. అమెరికా తరహా అధ్యక్ష వ్యవస్థను యధాతథంగా అమలు చేయటం మనకు తగదుగానీ.. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్లే అనే మన 'ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్' ఎన్నికల పద్ధతినైతే మార్చుకోవటం మనదేశ పరిస్థితుల్లో అవసరం. లోక్‌సత్తా చాలాకాలంగా చెబుతున్న ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి వాటి గురించి యువత ఆలోచన చేయాలి.

ఇక మహిళల పట్ల జరుగుతున్న వివక్ష స్పష్టంగా కనబడుతూనే ఉంది. భారతదేశంలో మహిళలు వారి సమస్యలను చర్చించాలంటేనే భయపడుతుంటారు. కుటుంబ సభ్యులే మొదటగా వ్యతిరేకిస్తారు. తనకంటే ఎక్కువ స్థాయిలో మహిళ ఉండకూడదు అని పురుషులు అనుకుంటున్న ఇళ్లే ఇండియాలో ఎక్కువగా ఉన్నాయి. తనకులేని గుర్తింపు ఆమెకెందుకు? అనే అహం ఇంకా తగ్గలేదు. ఆమె సంపాదించే యంత్రం, ఇంట్లో చాకిరీ చేసే రోబో. భార్యగా భర్త వెనకాల ఉండాలి. అంతవరకే

పరిమితం అవుతోంది. నా భార్య సలహాలు కూడా తీసుకుంటాను.. అనడం ఓ ఫ్యాషన్! అందరూ కాకపోయినా, చాలామంది మగవారు సలహాలు చెప్పే అవకాశం భార్యలకు ఇవ్వరు. మహిళలకు ఎంతో గౌరవమిస్తామని, పూజిస్తామని చెప్పుకునే భారతదేశంలో కంటే, అమెరికా వంటి దేశాల్లోనే మన మహిళలు ఎక్కువగా రాణిస్తున్నారు.

మనదేశంలో విద్యావంతురాలైన మహిళ గతం కంటే కొంత మెరుగ్గా ఉద్యోగినిగా, గృహిణిగా రాణిస్తున్నప్పటికీ రాజకీయపరంగా వెనుకబడే ఉంటోంది. మహిళల్లో ఎవరినైనా తప్పనిసరి పరిస్థితుల్లో నామినేట్ చేసినా, ప్రమోట్ చేసినా సెలబ్రిటీలకు తప్ప సేవాభావం, అవగాహన గలవారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. మహిళలు అందంగా ఉంటే, ముఖ్యంగా సినిమాలు, టీవీ సీరియళ్ల ద్వారా గ్లామరస్‌గా పాప్యులర్ అయి ఉంటే.. ఎక్కువ లాభం, మనకు పోటీ ఉండదు అనుకుంటున్నారుతప్ప, ప్రజల సమస్యల పట్ల అవగాహనతో మాట్లాడి, పరిష్కారాలను సాధించేవారిని ప్రోత్సహిద్దామన్న ఆలోచన లేదు. మరీ కష్టపడి లేదా అదృష్టవశాత్తూ ఎదిగిన మహిళలను మినహాయిస్తే, స్త్రీలు ఎంత నాయకులైనా సరే అలంకారప్రాయంగానే ఉండాలనే ఆలోచనా ధోరణి పార్టీల్లో కనిపిస్తోంది. తాజాగా స్మృతి ఇరానీ, ప్రియాంక గాంధీ మీద కామెంట్లను చూస్తే, మహిళా నాయకులకు సంబంధించి పలువురు పురుష నేతల ఇమేజినేషన్ ఎలా ఉందో అర్థమవుతుంది. ఈ బాధ భరించలేక.. కుటుంబ వ్యవస్థకు మనదేశంలో ఉన్న ప్రాముఖ్యతను అడ్డం పెట్టుకుని తల్లిగానో, అక్కగానో, చెల్లిగానో వరసలు కలిపి పిలిపించుకుంటూ ఎక్కువమంది మహిళా నేతలు బండి నెట్టుకొస్తున్నారు.

2019 సాధారణ ఎన్నికల్లో కూడా తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు సీట్ల కేటాయింపు అంతంత మాత్రంగా ఉంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మేనిఫెస్టోల్లో చెప్పుకున్న బీజేపీ, కాంగ్రెస్‌లు.. 13 శాతం టికెట్లనే ఇవ్వటం పెద్ద దగా. వ్యూహాత్మకంగానే అయినా, ఒడిషాలో నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌లో మహిళలకు 33 శాతం సీట్లు తమ పార్టీల తరపున కేటాయించారని చదివాను. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పుడే జేపీగారు ఈ సూచన చేశారు. యోగేంద్ర యాదవ్, మధు కిష్వర్ వంటి వారితో కలిసి ప్రత్యామ్నాయ మహిళా బిల్లును రూపొందించి అన్ని పార్టీలకూ అందజేశారు (లోక్‌సత్తా ప్రత్యామ్నాయ మహిళా బిల్లు వివరాల్ని మరోమారు లోక్‌సత్తా టైమ్స్‌లో ప్రచురిస్తే బాగుంటుందని సూచన). అసలు మహిళలే ఒక పార్టీ పెట్టుకుంటే ఆయా శాఖలకు అందరూ మహిళలే ప్రాతినిధ్యం వహించి న్యాయం చేకూర్చగలరు అనిపిస్తుంటుంది. మహిళల్లో స్వావలంబన, ఆత్మవిశ్వాసం, నాయకత్వం పెరగకుండా వీలైనంత అణగదొక్కే భారతదేశంలో ఈ రకమైన రాజకీయ వ్యూహం వల్ల తప్పక ప్రయోజనముంటుంది. ఆలోచించండి!

నేను నా పిల్లలకి నా దేశం గురించి చెబుతూ కొందరి పేర్లను తెలియజేస్తుంటాను. ఇండియా వెళ్లినప్పుడు వారిని చూపిస్తాను. అంతేగానీ, వర్గపోరాటాలు, కుల సంఘాలు, అభివృద్ధి లేని పాలనను చూపించాలనుకోవటం లేదు. గర్వకారణమయ్యే వ్యక్తులను భవిష్యత్తులో మరింత ఎక్కువమందిని ఇండియాలో చూపించాలని నా ఆశ. దేశ, వర్గ, కుల, ప్రాంతీయ భేదం లేని వసుధైక కుటుంబాలు మావి. వచ్చే తరం కూడా మాలాగే ఉంటుందనీ తెలుసు. ఒక్క మా కుటుంబానికే పరిమితం కాకుండా సర్వమానవాళికీ వర్తించేలా జీవనం ఉండాలన్నదే మా ఆశ! స్వచ్ఛమైన మనసుతో ఆలోచన్లు చేయగలవారు అనుకున్నది ఆచరించగలరు. మీరు నాతో ఏకీభవించగలరనీ, మీరూ మంచి భవిష్యత్ కోసం పాటుపడతారనీ, అవినీతిరహిత, కులమతవర్గరహిత, ధనిక–పేద తేడాలు లేని కొత్త రాజకీయాల్ని, పాలనా వ్యవస్థనీ ఆవిష్కరిస్తారని నమ్ముతున్నాను. ఎందుకంటే, జయప్రకాష్ నారాయణ్ వంటి వారు మనకు మార్గదర్శకులుగా ఉన్నప్పుడు ఇవి అసాధ్యాలు కావు. ఇది మీకు మంచి అవకాశం. నేను పుట్టుకతో భారతీయురాలిగా మా అమ్మానాన్నగార్ల పెంపకంలో నా దేశం.. మహనీయులున్న దేశంగా, సమగ్ర అభివృద్ధి కోసం త్యాగమూర్తులున్న దేశంగా ఎదిగేందుకు దోహదం చేయాలనుకుంటున్నాను. ఎక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా ఉంటుందో, ఎక్కడ మంచి రాజకీయాలు ఉంటాయో, ఎక్కడ ప్రజలు అన్ని మౌలిక సదుపాయాలనూ పొందగలుగుతారో.. అదే భారతదేశంగా నిరూపించాలని ఆశపడుతున్నాను. మాలాంటి వాళ్లం అమెరికా పౌరులుగా స్థిరపడినప్పటికీ మాతృదేశాభివృద్ధిని కాంక్షించకుండా ఉండం. నేను సిగ్గుపడేది ఇండియా నుంచి రాజకీయ నాయకులు కేవలం తమ వర్గ, తమ ధనసంపదలను ప్రదర్శించుకోవటానికే అమెరికా రావటం గురించి. అదృష్టవశాత్తూ అమెరికన్లకు చాలామట్టుకు ఈ విషయాలు తెలియవు. తెలిసివుంటే మరింత అవమానం కలిగేది. ఇండియా అంటే ఒకే అభిప్రాయంతో ఉండే వీరు కొన్ని సందర్భాల్లో మన వారి వికృత చేష్టలకి మనలను చీదరించుకోడం, అవహేళన చేయడం మన తప్పు వల్లనే. విదేశాలకు వచ్చినప్పుడైనా "అందరం ఒకటే. మేము ఇండియన్లం" అని హుందాగా ప్రవర్తించగలిగితే సంతోషిస్తాం. 'అది పుట్టుకతోనే లేనప్పుడు కొత్తగా రాదు, మేము ఇంతే' అంటే, తోటి భారతీయులకు కూడా నష్టం చేసినవారవుతారు. దయచేసి విదేశాల్లో కుల, మత రాజకీయాలను, భేషజాల విందులతో ప్రత్యేక ప్రదర్శనలను మానుకోండి. ఎన్నికల్లో ఖర్చుకి చందాలు వసూలు చేసుకోవచ్చు, కానీ ఇంత చౌకబారుగా, కుల, మత విభేదాలను సృష్టిస్తూ భారతీయుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి కాదు. ❐



# తెలంగాణ క్రీడా విధానం గురించి....

తెలంగాణ రాష్ట్రంలో క్రీడావిధానం రూపకల్పనలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు ఎఫ్‌డీఆర్ పరిశోధకులు ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) డిప్యూటీ డైరెక్టర్‌తో సమావేశ మయ్యారు. క్రీడా సంఘాలు, అధికారులు, అకాడమీల గురించి వివిధ కోణాలను సమావేశంలో చర్చించినట్లు వారు తెలిపారు.

Posting Date 22-04-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on April 16th 2019



# రాజకీయ పార్టీలు, ఎన్నికల వ్యవస్థలు ఎందుకోసం?

"అత్యుత్తమ సామర్థ్యం గలవారు హేతుబద్ధ, నైతిక మార్గాల ద్వారా వేగంగా అధికారంలోకి రాగలిగేలా చేయటమే రాజకీయ పార్టీలు, ఎన్నికల వ్యవస్థల పరమార్థం".

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad